
తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం




సంపుటి :03, సంచిక :73 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, ఆదివారం సెప్టెంబర్ 07, 2025, పేజీలు -12, వెల -5/-

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur

# బై.. బై.. గణేషా



## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహా గణపతి..


బాహుబలి క్రేన్ పాయింట్ 4 దగ్గర బడా గణపతి నిమజ్జనం

ఖైరతాబాద్ మహా గణనాథుడి నిమజ్జన మహోత్సవం ఘనంగా ముగిసింది.తొమ్మిది రోజులుగా విశేష పూజలందుకున్న బడా గణేషునికి జయ జయధ్వానాలతో ఘనంగా వీడ్కోలు పలికారు భక్తజనులు.

2లో

## ట్రంప్‌కు మోడీ మరో షాక్?

- ఐక్యరాజ్యసమితి సమావేశాలకు దూరం



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 06(తెలుగు - వెలుగు):** అమెరికా అధిక టారిఫ్‌ల వేళ భారత్ తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులో అమెరికాలో జరగనున్న ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరు కావాల్సి ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఈ సమావేశాలకు మోదీ హాజరు కావడం లేదని తెలిసింది. ఆయనకు బదులు విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఈ సమావేశాల్లో ప్రసంగించనున్నట్లు తాజా సమాచారం. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ఐక్యరాజ్యసమితి 80వ జనరల్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. హై లెవల్ డిబేట్ మాత్రం సెప్టెంబర్ 23 నుంచి 29 వరకు జరగనున్నది. చర్చలో పాల్గొనే వక్తల జాబితాను తాజాగా మిగతా2లో...

## ఆపరేషన్ సిందూర్ మూడ్రోజుల్లో ముగియలేదు

• ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఆసక్తిక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 06(తెలుగు - వెలుగు):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టడం, ముగించడంపై ఆర్మీ చీఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్ అందరూ అనుకున్నట్లు- మూడు రోజుల్లోనే ముగిసిపోలేదని, చాలా రోజులు కొనసాగిందని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. దిల్లీలో 'ఆపరేషన్ సిందూర్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ ఇండియాస్ డీప్ స్ట్రైక్స్ ఇన్‌సైడ్ పాకిస్థాన్' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.ద్వివేది మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పాకిస్థాన్‌తో మే 10న యుద్ధం ముగిసిందని మీరు అనుకుంటున్నారు. కానీ కాదు. అనేక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉండటంతో.. అది చాలా రోజులు కొనసాగింది. ఆ విషయాలన్నీ ఇక్కడ మిగతా2లో...



## కమిషన్లు రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

కాళేశ్వరంతో కమిషన్లు లాగారు

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసారు

మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు

2లో

## రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించాకే శ్లాబులు

జీఎస్టీ శ్లాబులపై నిర్మలా సీతారామన్ వివరణ

ధరలు దిగివచ్చి..సామాన్యులకు మేలుచేస్తుందని వెల్లడి



2లో



## ఫామ్‌హౌజ్‌లో కెసిఆర్ సుదీర్ఘ చర్చలు

కెటిఆర్, హరీష్ రావులతో మంతనాలు

**గజ్వేల్,06(తెలుగు - వెలుగు):** భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌తో మాజీ మంత్రి హరీశ్‌రావు సమావేశమయ్యారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ- అయ్యారు. ఇప్పటికే కేటీఆర్ సహా పలువురు పార్టీ ప్రముఖులు అక్కడ ఉన్నారు. ఇటీవల అసెంబ్లీలో చోటు-చేసుకున్న పరిణామాలు, కాళేశ్వరంపై దర్యాప్తును సీబీఐకి అప్పగించడం, ఎమ్మెల్సీ పదవికి, భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కవిత రాజీనామా చేయడం తదితర అంశాలపై వీరు చర్చించినట్లు- తెలుస్తోంది. ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో సుదీర్ఘంగా చర్చలు కొనసాగాయి. మాజీ మంత్రులు కేటీ-ఆర్, హరీష్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ- అయిన విషయం తెలిసిందే. మిగతా2లో...

## ఢిల్లీలోని ఎర్రకోటలో దొంగలు

- కోటి రూపాయల కలశం తస్కరణ



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 06(తెలుగు - వెలుగు):** దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో దొంగలు పడ్డారు... ఏకంగా కోటి రూపాయలు విలువ చేసే కలశాన్ని ఎత్తుకుపోయారు..! ఈ ఘటన ఈ నెల 2వ తేదీన జరిగిందని పోలీసులు తెలిపారు. ఎర్రకోట పార్కులో నిర్వహించిన జైన మతపరమైన ఆచారం నుండి ఒక అమూల్యమైన కలశం మాయమైంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ఈ మత ఆచారానికి వచ్చిన సమయంలో ఈ విషయం వెలుగుచూసింది. ఆయనను స్వాగతిస్తున్న సమయంలో ... కలశం కనబడలేదు. వ్యాపారవేత్త సుధీర్ జైన్ ప్రతిరోజూ పూజ కోసం ఆ కలశాన్ని తీసుకువచ్చే వారని పోలీసులు తెలిపారు. ఢిల్లీ పోలీసుల కథనం మేరకు ... కలశాన్ని దొంగిలించిన నిందితుడి కదలికలు సీసీటీ-వీ ఫుటేజీలో రికార్డయ్యాయి. పోలీసులు నిందితుడిని కూడా గుర్తించారు. త్వరలోనే అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఎర్రకోట సముదాయంలోని జైన సమాజం ఆధ్వర్యంలో కలశ పూజ ఆచారం ఆగస్టు 15 నుండి 9 వరకు కొనసాగుతుంది. ఇదే అదునుగా

మిగతా2లో...

## మాతృభాషతో చదువు, ఉద్యోగాల అనుసంధానం

అప్పడే ఇంగ్లీష్ వ్యామోహం తగ్గతుంది

తూమాటి దోణప్ప వర్ధంతి కార్యక్రమంలో వెంకయ్య



**విజయవాడ,సెప్టెంబర్ 06(తెలుగు - వెలుగు):** చదువు, ఉద్యోగాలను మాతృభాషతో అనుసంధానం చేసే దిశగా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు కదలాలని, అప్పుడే ఇంగ్లీషుపై వ్యామోహం పోతుందని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మిగతా2లో...

## 35లక్షలకు బాలాపూర్ గణేశ్ లడ్డూ



ఏళకలుగా లడ్డూ కోసం యత్నిస్తున్న దశరథ గౌడ్

**హైదరాబాద్, 06(తెలుగు - వెలుగు):** తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బాలాపూర్ లడ్డూ వేలం పాట ఘనంగా సాగింది. ఈ సారి లడ్డూ వేలంలో భారీ ధర పలికింది. మిగతా2లో...

తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం



# బై.. బై.. గణేషా



**హైదరాబాద్,సెప్టెంబర్ 06(తెలుగు – వెలుగు):** హైదరాబాద్ నగరంలో గణేష్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగుతోంది. దారులన్నీ గణపయ్య విగ్రహాలతో హుస్సేన్ సాగర్ వైపు పయనమయ్యాయి. గణపయ్య భక్తులు ఆటపాటలతో శోభాయాత్రాలో పాల్గొంటున్నారు. గణేష్ నిమజ్జనం వేళ నగరమంతా సందడి వాతావరణం నెలకొంది. నగరంలో అత్యంత విశిష్టత కలిగిన ఖైరతాబాద్ మహా గణపతి శోభాయాత్ర ఈ ఉదయం ప్రారంభమైన విషయం తెలిసిందే. వేలాది మంది భక్తులు శోభాయాత్రలో పాల్గొనగా బడా గణేషుడు హుస్సేన్ సాగర్ కు తరలివెళ్లాడు.గణేష్ శోభా యాత్ర కన్నుల పండుగగా జరిగింది. భగభగ మండుతున్న భానుడి ని కూడా లెక్కచేయకుండా బడా గణేష్ శోభాయాత్రలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోలాహలం మధ్య గణనాథుడు ఎన్టీఆర్ మార్గంలోని క్రేన్ నంబర్ 4 వద్దకు చేరుకున్నారు. అన్ వెల్డింగ్ పనుల అనంతరం ఖైరతాబాద్ మహా గణపతి గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. బై బై గణేషా అంటూ భక్తులు వీడ్కోలు పలికారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

# ట్రంప్‌కు మోడీ మరో షాక్?

(మొదటి పేజీ తరువాయి)

యూఎన్ గత నెల రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. తొలుత బ్రెజిల్ చర్చను ప్రారంభిస్తుంది. ఆ తర్వాత అమెరికా మాట్లాడుతుంది. సెప్టెంబర్ 23వ తేదీన యూఎన్జీఏ పోడియం నుంచి డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. సెప్టెంబర్ 26వ తేదీన ప్రధాని మోదీ ప్రసంగం ఉంటు–ందని ఆ జాబితాలో ఉంది. అదే రోజున ఇజ్రాయిల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నేతలు కూడా ప్రసంగిస్తారు. ఈ సమావేశాలకు ప్రధాని యూఎస్ వెళ్తారని అంతా భావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇరుదేశాల మధ్య నెలకొన్న వాణిజ్య సమస్యల పరిష్కారానికి ట్రంప్–మోదీ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే, అనూహ్యంగా ఈ సమావేశాలకు మోదీ దూరంగా ఉన్నట్లు– తెలిసింది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# ఆపరేషన్ సిందూర్ మూడ్రోజుల్లో ముగియలేదు

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించలేను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాక్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు ఇంకా ఉన్నారని, సరిహద్దు వెంబడి వారి చొరబాటు– ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. భారత్ చేపట్టిన ఆపరేషన్‌లో ఎంత మంది ఉగ్రవాదులు హతమయ్యారో అందరికీ తెలుసన్నారు. ఆపరేషన్ సమయంలో సాయుధ దళాల సహకారాన్ని ఆయన ప్రశంసించారు. ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలను ద్వివేది స్వాగతించారు. డ్రోన్‌లపై జీఎస్టీని 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం హర్షణీయమన్నారు. భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో పాక్, పీవోకేలోని ఉగ్ర శిబిరాలే లక్ష్యంగా మెరుపుదాడులు చేసింది. అత్యంత కచ్చితత్వంతో కీలక ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. దీంతో ఇరుదేశాల మధ్య కొన్ని రోజులపాటు– భీకర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అనంతరం పాక్ అభ్యర్థన మేరకు భారత్ కాల్పుల విరమణకు అంగీకరించింది. ఈ క్రమంలో ద్వివేది చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఢిల్లీలోని ఎర్రకోటలో దొంగలు

(మొదటి పేజీ తరువాయి)

భావించిన దొంగలు కోట్ల రూపాయల విలువైన కలశాన్ని దొంగిలించారు. ఇందుకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలతో ప్రయత్నాలు ప్రారంభించారు. దొంగిలించిన కలశం చాలా విలువై నదని, దాని విలువ దాదాపు కోటి రూపాయలు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. మొత్తం కలశం బంగారం, వజ్రాలతో పొదిగి ఉందని, ఇది 760 గ్రాముల బంగారంతో తయారు చేసిందని చెబుతున్నారు. కలశంపై 150 గ్రాముల వజ్రాలు, మాణిక్యాలు, పచ్చలు పొదిగి ఉన్నాయని సమాచారం. ఇంత విలువైన కలశం దొంగతనం కలకలం సృష్టించింది. దీనికి ముందు కూడా ఎర్రకోట వద్ద భద్రతా లోపం బయట పడింది. ఆగస్టు 2న, ఎర్రకోట భద్రత కోసం మోహరించిన పోలీసులు బాంబును గుర్తించలేకపోయినప్పుడు ఒక కేసు వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ పోలీసుల కథనం ప్రకారం ... ఆగస్టు 2న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల రిహార్సల్‌లో భాగంగా మాక్ డ్రిల్ కోసం స్పెషల్ సెల్ బృందం సాధారణ దుస్తుల్లో వచ్చింది. వారు తమతో పాటు– నకిలీ బాంబును తీసుకుని ఎర్రకోటలోకి ప్రవేశించారు. కానీ ఎర్రకోట భద్రత కోసం మోహరించిన పోలీసులు ఆ బాంబును గుర్తించలేకపోయారు. అప్పుడు నిర్లక్ష్యం కారణంగా పోలీసులను కూడా సస్పెండ్ చేశారు. ఇప్పుడు దొంగతనం సంఘటన వెలుగులోకి వచ్చింది.

# ఫామ్‌హౌజ్‌లో కెసిఆర్ సుదీర్ఘ చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్నట్లు– తెలుస్తోంది. హరీష్ రావుపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై ఆసక్తికర చర్చ జరుగుతున్నట్లు– సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి ప్రభుత్వం అప్పగించిన విషయంపై ఆదివారం కూడా సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. కొద్దిసేపటి క్రితమే.. ఫామ్ హౌస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లినట్లు– సమాచారం. అయితే.. ఫామ్ హౌస్‌లోనే హరీష్ రావు, కేటీఆర్ ఉండనున్నట్లు– తెలుస్తోంది. ఈ మేరకు రేపటి సమావే శాల తరువాత మీడియా సమావేశం లేదా ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. అయితే మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై తాజాగా మాజీ మంత్రి హరీష్ రావు స్పందించిన విషయం తెలిసిందే. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని తెలిపారు. రాష్ట్ర సాధనలో తన నిబద్ధత అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. ప్రజల ఆకాంక్షల మేరకే పనిచేయాల్సిన బాధ్యత తనపై ఉందని నొక్కిచెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో ఓ కార్యకర్తలాగా తాను పాతికేళ్లు పనిచేశానని వ్యాఖ్యానించారు. తనపై, పార్టీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. తనపై దిగజారుడు రాజకీయాలు మంచిది కాదని హరీష్‌రావు హితవు పలికారు. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న సమావేశం ప్రాధాన్యత సంతరిం చుకుంది. అయితే సమావేశాల అనంతరం బీఆర్ఎస్ ఎలాంటి ప్రకటన చేస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

# సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు అస్వస్థత

## - అపోలోకు తరలించి చికిత్స

**హైదరాబాద్,సెప్టెంబర్ 06(తెలుగు – వెలుగు):** సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ అస్వస్థతకు గురయ్యారు. దీంతో, ఆయనను జూబ్లీహిల్స్ అపోలో ఆసుప్రతికి తరలించారు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు– వైద్యులు వెల్లడించారు. శ్రీశైలం దర్శనం కోసం వెళ్లిన ఆయన శనివారం ఉదయం హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది.. ఆయన్ను జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన పోలీసు ఉన్నతాధికారులంతా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నా రు.శుక్రవారం నగరానికి చేరుకున్న ఆయన హైదరాబాద్ జోన్ సీబీఐ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

# రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించాకే శ్లాబులు

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 06(తెలుగు – వెలుగు):** జిఎస్‌టి శ్లాబులు 5, 12,18, 28 శాతంగా ఉండేవి. అయితే ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్టుగా ఈ శ్లాబుల విధానం బిజెపి నిర్ణయం కాదని, రాష్ట్ర ఆర్థిక మంత్రుల సాధికార కమిటీ– తీసుకున్నదని శనివారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నాలుగు శ్లాబుల విధానంపై ప్రతిపక్ష పార్టీలు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆమె శనివారం అన్నారు. నాలుగు శ్లాబుల విధానం కాస్తా.. తాజాగా జరిగిన జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో 5, 18 శాతం శ్లాబులకి తగ్గిస్తూ.. గతంలో ఉన్న 12, 28 శాతం శ్లాబులను తొలగిస్తూ ఈ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ శ్లాబులు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానుంది. తాజాగా ఈ విషయంపై నిర్మలా సీతారామన్ పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'సామాన్యులపై దృష్టిసారించి సంస్కరణలు చేపట్టాము. సామాన్యుడు వినియోగించే వస్తువులపై విధించే పన్నుపై సమీక్షించాము. ఈ సంస్కరణల వల్ల రేట్లు– బాగా తగ్గనున్నాయి' అని ఆమె అన్నారు. ఇకపోతే జీఎస్టీ లో సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు అన్ని రాష్ట్రాలకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు లేఖ రాసినట్లు– చెప్పారు. పన్ను రేట్లను సవరించాలనే దానిపై రాష్ట్రాలు అభిప్రాయాలు చెప్పినప్పటికీ.. అవన్నీ సామాన్యుడికి ప్రయోజనం కలిగించేవేనని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశ ప్రజలకు ఎంతో దోహదపడతాయన్నారు. జీఎస్టీ రేట్లలో మార్పునకు మద్దతు తెలియ జేసినందుకు ప్రతి ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు తెలియజేశా. ఎన్ని తీవ్రమైన చర్చలు, వాదనలైనా చేయవచ్చు. చివరకు జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలతో దేశ ప్రజలకు ఉపశమనం కలిగింది. ఇందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ లేఖ రాశానని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. సామాన్యులకు ప్రయోజనం చేకూర్చే సవరణలే ఉన్నాయని, వీటికి వ్యతిరేకంగా మాట్లాడే అవకాశమే లేదన్నారు. దేశ ప్రయోజనాల కోసం అందరూ ఒక్కతాటిపైకి రావడం సంతోషకర విషయమన్నారు.రేట్ల తగ్గింపుపై రాష్ట్రాలు ఎప్పుడూ అనుకూలంగానే ఉంటాయని, అయితే, వారి ఆందోళనంతా రాబడిలో కోతపైనే ఉంటుందని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తాజా తగ్గింపుతో రాష్ట్రాలకే కాకుండా కేంద్రం కూడా ఆదాయం కోల్పోతుందన్న విషయం వారికి చెప్పాను. రేట్లు– తగ్గితే ప్రజలు కొనుగోలు చేస్తారు. తద్వారా కోల్పోయిన ఆదాయాన్ని ప్రభుత్వాలు భర్తీ చేసుకోవచ్చు.ఏకాభిప్రాయం కుదిరిందని కేంద్ర మంత్రి వివరించారు. ఇదిలాఉంటే, ఇటీవల తీసుకున్న జీఎస్‌టీ– కొత్త రేట్లు– సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్న విషయం తెలిసిందే.

# మాతృభాషతోచదువు, ఉద్యోగాల అనుసంధానం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. తద్వారా మన మాతృభాషను పరిరక్షించుకుని, ముందుతరాలకు సగర్వంగా అందించడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆచార్య తూమాటి దొణప్ప 30వ వర్ధంతి సందర్భంగా విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం' పుస్తకాన్ని వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. పుస్తక రూపకర్తలైన చెన్నపురి తెలుగు అకాడమీ సభ్యులు తూమాటి సంజీవరావు, తిరునగరి భాస్కర్‌తో పాటు– పుస్తకంలోని వ్యాసాలు అందించిన రచయితలకు అభినందనలు తెలిపారు. మన జీవన విధానంలో మాతృభాష ఆయువుపట్టు– అని.. తెలుగు సంప్రదా యాలను పునరుజ్జీవం చేయాలని పిలుపునిచ్చారు. జానపద సాహిత్యం మొదలుకుని, తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి తదితర విభాగాల్లో ఆచార్య దొణప్ప చేసిన కృషి మహోన్నతమైందని... సాహితీ సవ్యసాచిగా, సాహితీ కృషీవలుడిగా పేరు పొందారన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతిగా దొణప్పని నియమించిన సందర్భంలో తాను అప్పటి సీఎం ఎన్టీఆర్‌ను ఓ మంచి నిర్ణయం తీసుకున్నారని అభినందించానని వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు. ఎంతో మంది మహనీయుల కృషి ఫలితంగా... కేంద్ర ప్రభుత్వం తెలుగుకు ప్రాచీన హోదా ఇచ్చినా, తెలుగు వెలుగులు భావితరాలకు అందకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాచీన తెలుగు హోదా ఫలాలు భవిష్యత్ తరాలకు అందేందుకు తెలుగు వారంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# గణేష్ ఉత్సవాల బందోబస్తు ఓ అనుభవం

## ● ఏ పండగ అయినా తొక్కిసలాట రాకుండా చూస్తాం ● ట్రైనీ ఐపిఎస్ అధికారులతో కమిషనర్ సివి ఆనంద్

**హైదరాబద్,సెప్టెంబర్ 06(తెలుగు – వెలుగు):** గణేష్ ఉత్సవాల బందోబస్తు నిర్వహించడం 13వ సారి అని, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నాలుగో సారి అని సివి ఆనంద్ తెలిపారు. శనివారం నేషనల్ పోలీస్ అకాడమీ నుండి 170 మంది ట్రైనీ ఐపిఎస్ అధికారులతో కమిషనర్ సివి ఆనంద్‌తో ముఖాముఖిగా మాట్లాడారు. సివి ఆనంద్ హైదరాబాద్ నగరంలో 10 సంవత్సరాలుగా విధులు నిర్వహించిన తన అనుభవాన్ని పంచుకున్నారు. హైదరాబాద్ దేశంలోనే అత్యంత సున్నితమైన, విస్తారమైన నగరాల్లో ఒకటని, ఇక్కడ అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారని,



అందుకే పండుగల నిర్వహణ చాలా ముఖ్యమని వివరించారు. గణేష్ ఉత్సవాలకు పోలీసులు బందోబస్తు ఎలా నిర్వహిస్తారో వివరిస్తూ, ఈ ఏడాది నిమజ్జనం కోసం చివరి రోజున సుమారు 25,000 విగ్రహాలు వచ్చే అవకాశం ఉందని ఆనంద్ పేర్కొన్నారు. ఇంత భారీ స్థాయిలో జరిగే ఈ ఉత్సవానికి ఎలాంటి తొక్కిసలాటలు జరగకుండా భద్రత కల్పించడం చాలా ముఖ్యమని చెప్పారు. గణేష్ ఉత్సవం, మిలాద్ ఉన్ నబీ, బోనాలు, దసరా నవరాత్రులు, హనుమాన్ ర్యాలీ, శ్రీ రామనవమి ర్యాలీ వంటి పండుగల సందర్భంగా తొక్కిసలాటలు జరగకుండా హైదరాబాద్ పోలీసులు తీసుకుంటున్న కార్యాచరణ ప్రణాళిక, సన్నాహాలు, వ్యూహాలు మరియు ఇతర చర్యల గురించి ఒక పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆన్‌లైన్ అనుమతి ఫారాలు, విగ్రహాలకు జియోట్యాగింగ్, డ్రోన్‌లు, యాప్‌లు, సిసిటివిల వాడకం, అలాగే మల్టీ–ఏజెన్సీ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వంటి సాంకేతికతను పోలీసులు ఎలా వినియోగిస్తున్నారో కూడా కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో రామ్ నివాస్ సేపట్, ఐపీఎస్, కల్మేశ్వర్ సింగేన్వార్, ఐపీఎస్ మరియు పుష్ప, డీసీపీ, పాల్గొన్నారు.

# 35లక్షలకు బాలాపూర్ గణేశ్ లడ్డూ

(మొదటి పేజీ తరువాయి)

దీన్ని కర్మన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ అనే వ్యక్తి రూ.35 లక్షలకు దక్కించుకున్నారు. వేలంలో 38 మంది భక్తులు పాల్గొన్నారు. గతేడాది ఈ లడ్డూను రూ.30.01 లక్షలకు కొలను శంకర్‌రెడ్డి దక్కించుకున్నారు. గతేడాదికంటే ఈసారి లడ్డూ ధర రూ.4.99 లక్షలు అధికంగా పలికింది. లడ్డూ విజేత దశరథగౌడ్‌ను ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ– సన్మానించింది. 'బాలాపూర్ లడ్డూ అంటే నాకు చాలా ఇష్టం. ఆరేళ్లుగా దీని కోసం ప్రయత్నిస్తున్నా. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ లడ్డూ దక్కింది. ఎంతో సంతోషంగా ఉందని దశరథగౌడ్ పేర్కొన్నారు. బాలాపూర్ గణేశుడి లడ్డూ కోసం ఆరేళ్లుగా ప్రయత్నిస్తున్నాని లడ్డూ విజేత లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. ఇన్నేళ్ల తర్వాత బాలాపూర్ గణేశుడి లడ్డూ దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. బాలాపూర్ గణేశ్ అంటే తనకు చాలా ఇష్టమని, గత కొన్నేండ్ల నుంచి ఇక్కడికి వస్తున్నట్లు– పేర్కొన్నారు. ఇవాళ ఆ భగవంతుడు నాకు లడ్డూను దక్కించాడు.. చాలా సంతోషంగా ఉందని లింగాల దశరథ గౌడ్ పేర్కొన్నారు. లడ్డూ విజేత దశరథ గౌడ్‌ను ఉత్సవ కమిటీ– సన్మానించింది. రూ. 35 లక్షల నగదును ఉత్సవ కమిటీకి దశరథ గౌడ్ అందించారు. రాష్ట్రంలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న బాలాపూర్ గణేశుడి లడ్డూ మరోసారి భారీ ధర పలికింది. గత రికార్డులను బ్రేక్‌చేస్తూ వేలం పాటలో రూ.35 లక్షలకు కర్మాన్‌ఘాట్‌కు చెందిన లింగాల దశరథ గౌడ్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇది గతేడాదికంటే రూ. 4.99 లక్షలు అధికం. 2024లో బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితికి చెందిన కొలను శంకర్ రెడ్డి రూ.30.01 లక్షలకు దక్కించుకున్నారు. బాలాపూర్ గణేశుడి ఊరేగింపు తర్వాత గ్రామంలోని బొడ్రాయి వద్ద వేలం పాట నిర్వహించారు. ఇందులో మొత్తం 38 మంది పాల్గొన్నారు. వారిలో ఏడుగురు స్థానికేతరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి పాల్గొన్నారు. లడ్డూవేలం తిలకించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

# కమిషన్లు రావనే పేదలకు ఇళ్లు కట్టలేదు

## ● కాళేశ్వరంతో కమిషన్లు లాగారు ● రాష్ట్రాన్ని అప్పల కుప్పగా చేసారు ● మంత్రి పొంగులేటి ఘాటు విమర్శలు



**వనపర్తి,సెప్టెంబర్ 06(తెలుగు – వెలుగు):** కల్వకుంట్ల కుటుంబం పదేళ్లలో భారీగా అవినీతికి పాల్పడిందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పేదలకు ఇళ్లు కడితే కమిషన్లు రావని కాళేశ్రం కట్టారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లలో 8 లక్షల 19 వేల కోట్ల రూపాయల అప్పుల భారం ప్రజలపై మోపిందని ఆక్షేపించారు. శనివారం వనపర్తి జిల్లాలోని పెద్దమందడి మండలం మంగంపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు గృహప్రవేశం చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం నెల నెల వడ్డీలు కడుతూనే.. అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడెడ్లలా ముందుకు తీసుకుపోతున్నామని ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పేదవారిని ఓటు– బ్యాంకుగా మాత్రమే చూశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 7 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని.. పాత రేషన్ కార్డుల్లో 17 లక్షల మంది పేర్లను చేర్చామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంవత్సరానికి రెండువేల డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చి ఉంటే అందరికీ ఇళ్లు వచ్చేవని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇళ్లు కడితే కమిషన్లు రావని తెలిసి మాజీ సీఎం కేసీఆర్ ఇళ్లను కట్టలేదని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే కమిషన్లు వస్తాయని తెలిసి ఆ ప్రాజెక్టును చేపట్టారని విమర్శించారు. కాళేశ్వరంలో కేసీఆర్ ప్రభుత్వం భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాబోయే మూడు విడతల్లో ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టిచ్చి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్యే "నల్లమిల్లి" ఆకస్మిక తనిఖీ



**తెలుగు - వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** అనపర్తి ఏరియా ఆసుపత్రి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం ఆసుపత్రిలో వసతులు,మౌలిక సదుపాయాలు పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలోని వార్డుల్లో ఉన్న రోగుల వద్దకు వెళ్ళి వారికి అందుతున్న సేవల పై ఆరా తీశారు. పేషెంట్లు తమకు సరైన సేవలు అందిస్తున్నట్టు ఎమ్మెల్యేకు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రోగులకు సక్రమంగా సేవలు అందించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ తాడి రామ గుర్రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మేడపాటి సత్యన్నారాయణ రెడ్డి (అన్నవరం), డి కె దుర్గాప్రసాద్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

# శ్రీ శివ పంచాయత హనుమాన్ ఆలయం వద్ద అన్నదానం



**తెలుగు వెలుగు ప్రతినిధి(ఏర్గట్ల, మండలం )** మండల కేంద్రం ఏర్గట్ల లోని శ్రీ శివ పంచాయతీ హనుమాన్ ఆలయం వద్ద స్థానిక బద్దం సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పఠనం, ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమము నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెల మొదటి శనివారం రోజున అన్నదానం నిర్వహించటం జరుగుతుందని,ఎవరైనా అన్నదాన దాతలు ఉంటే ఆలయ కమిటీకి సంప్రదించాలని వారు అన్నారు.బద్దం వారి సంఘాల సభ్యులు, హన్మన్ భక్తులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

# బై బై గణేశా..!

**స్వర్ణగిరి గణేశుడిగా పూజలు అందుకున్న లంబోదరుడు**

**గణేశుడిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు**



జై జై గణేశా అంటూ తొమ్మిది రోజులపాటు పూజలు అందుకున్న స్వర్ణగిరి గణేశుడిని పలువురు పట్టణ ప్రముఖులు పూజించారు. నిమజ్జనానికి ముందు గణేశుడుని దర్శించుకున్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్తలు పలబట్ల సతీష్, సీనియర్ జర్నలిస్టులు లక్కాకుల రమేష్ కుమార్, టీవీ9 శివకుమార్ తదితరులు స్వర్ణ గిరి దేవాలయంలో వినాయకుడికి పూజలు చేశారు. అదేవిధంగా సీనియర్ జర్నలిస్టు కె.పి, మధురపురం మాజీ ఎంపీటీసీ భార్గవ కుమార్ రెడ్డి, కొత్తపేట వస్పాల్ తదితరులు స్వర్ణగిరి గణేషుడిని దర్శించారు. అద్భుతమైన సెట్టింగులతో అదరగొట్టిన నిర్వాహకులను వారు ప్రత్యేకంగా అభినందించారు.



# కోళ్ల మృత్యువాత పై జిల్లా పౌల్ట్రీ రైతులకు డిఏహెచ్‌వో సూచన



**తెలుగు - వెలుగు, తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో వివిధ కారణాల వలన అధిక శాతం కోళ్లు మృత్యువాత పడుతున్నాయని దీనిని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులు, పెరటి కోళ్ల పెంపకం దారులు, మార్కెట్లో వ్యాపారస్తులు ఎటువంటి అలసత్వం వహించకుండా తమ ఫారాల్లో బయో సెక్యూరిటీ ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా పశుసంవర్ధక అధికారి టి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు పశుసంవర్ధక శాఖ తరచుగా జారీ చేసే సూచనలను పౌల్ట్రీ రంగంలోని రైతులు తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. జిల్లాలో ఎక్కడైనా పెద్ద సంఖ్యలో కోళ్లు మృతి చెందితే సమీప పశుసంవర్ధక శాఖ సిబ్బందికి తెలియజేయాలని, అదేవిధంగా జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయ కాల్ సెంటర్ (8834058087) కు తక్షణమే సమాచారం ఇవ్వాలని ప్రజలకు, పౌల్ట్రీ రంగ రైతులకు జిల్లా పశు సంవర్ధక అధికారి టి శ్రీనివాసరావు ఆ ప్రకటనలో సూచించారు.

# వ్యాపారంగంలో పెట్టుబడులకు దుబాయ్ భూతల స్వర్గం అని చెప్పొచ్చు: నారెడ్కో తెలంగాణ ఉపాధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** వ్యాపార రంగంలో దుబాయ్ పెట్రోల్ బడులకు భూతల స్వర్గమని ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో దుబాయ్ నగర నిర్మాణాన్ని మార్గదర్శిగా తీసుకుంటాం అని నారెడ్కో తెలంగాణ ఉపాధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. శనివారం హైటెక్ సిటీలోని అవాసా హోటల్ లో అమాజా రియల్ ఎస్టేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక దుబాయ్ ప్రాపర్టీ ఈవెంట్ ను నారెడ్కో తెలంగాణ ఉపాధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ప్రారంభించారు. ప్రసిద్ధ రాజకీయ జ్యోతిష్యశాస్త్రవేత్త, మిత్రుడు డా. వినీత్ భట్ ఆహ్వానం మేరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ నిర్మాణ రంగంలో హైదరాబాద్ వాసులు ఇప్పుడు దుబాయి లో కూడా పెట్టుబడులు పెట్టొచ్చు, నిర్మాణరంగంలో రిజిస్ట్రేషన్ లు కూడా ప్రారంభం అయ్యాయని, ప్రపంచానికి నిర్మాణ రంగంలో తలమానికం దుబాయ్ ఉందని, నిర్మాణరంగంలో హైదరాబాద్ కూడా దుబాయ్ తో పోటీపడుతున్నారనీ అన్నారు. వ్యాపార, నిర్మాణరంగంలో నూతన ఒరవడిలో సృష్టించడంలో దుబాయ్ ముందుంది అన్నారు. ఎగ్జిబిటర్లను కలుసుకొని దుబాయ్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్లలో ఉన్న అవకాశాలు, తాజా గోల్డెన్ వీసా విధానాలు, తెలంగాణ, దుబాయ్ రియల్ ఎస్టేట్ రంగాల పరస్పర అభివృద్ధి గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అమాజా దుబాయ్ ప్రాపర్టీ షో సభ్యులు, జాయెద్ అలీ, సుల్తాన్, మహమ్మద్ అబ్దుల్లా, నౌర్సినే కెబికయే, ఆయా దెర్రాడ్జ్, అబ్దుల్ మజీద్ తెక్కట్, అబాంబ్ యూస్సేఫ్, అమిన్ ఇబ్రహీం, అనిల్ కుమార్ నాయుడు సుంకర, శ్రీరంగం అర్బన్ సిఎఫ్ఓ పులి నాగరాజు, అంబటి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్పల్లి బజరంగ్దళ్ గణపతి మండపం వద్ద అన్న ప్రసాద కార్యక్రమం...

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సౌజన్యంతో అన్నప్రసాద కార్యక్రమం...**




**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కూకట్పల్లిలోని టీమ్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరస్వామి వారికి నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులైనారు. అనంతరం రాజేశ్వరరావు అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ భక్తులందరికి ప్రసాదం రూపంలో అన్నదానాన్ని అందించడం ఎంతో పుణ్యఫలప్రదమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సాత్విక వాతావరణాన్ని పెంపొందిస్తాయని అన్నారు.


# క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలికి ఎన్నారై మహారాణా ఆర్థిక సహాయం...



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతున్న జనసేన వీర మహిళ వీర మహాలక్ష్మికి ఎన్ఆర్ఐ మహారాణ ఆర్థిక సహాయం అందజేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో అట్లాంటా తాజ్ చెందిన ఎన్ఆర్ఐ జనసైనికుడు యడవల్లి మహారాణా తమ కుటుంబ సభ్యుల రేవు సునీల్ కుమార్ , యడవల్లి మౌళిమ , రేవు ఆర్క ద్వారా క్యాన్సర్ వ్యాధితో చికిత్స పొందుతున్న బొండాడ మహాలక్ష్మికి చికిత్స నిమిత్తం ఐదు లక్షల ఆర్థిక సహాయం అంద చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి వీర మహిళా కోఆర్డినేటర్ నాయకురాలు అల్లం శెట్టి భాగ్యలక్ష్మి, కొల్లా శంకర్ , అంజి , శేర్లింగంపల్లి వీర మహిళ నాయకురాలు ద్రాక్షాయిని, జూబ్లీహిల్స్ జనసేన నాయకుడు బండి కల్ల శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా నిమజ్జనానికి ఘనంగా తరలి వెళ్లిన కూకట్పల్లి వినాయక భక్త బృందం భారీ వినాయకుడు...

**కూకట్పల్లి పురవీధుల్లో ఆటపాటలతో భారీగా ఊరేగింపు...**



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కూకట్ పల్లి బిజెపి కార్యాలయ ప్రాంగణం లో వినాయక భక్త బృందం వారు ప్రతిష్టించిన భారీ వినాయకుని శనివారం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. పది రోజులపాటు ఘనంగా పూజలు అందుకుని అంగరంగ వైభవంగా నిమర్జనానికి బయలుదేరారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని గణపతి దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణేష్ నిమర్జనాన్ని భక్తులందరూ ప్రశాంతయుతమైన వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో వ్యవహరించాలని కోరారు. గణపయ్య ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్య సౌఖ్యాలు, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వినాయక భక్తబృందం కమిటీ చైర్మన్ నాయినేని సూర్యప్రకాష్ రావు, సభ్యులు అర్చనపల్లి సూర్యారావు చౌదరి సూర్యారావు, పాపారావు, పద్మయ్య వెంకటస్వామి, శ్రీనివాస్ గౌడ్, నాగరాజు, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్ వినాయక ఉత్సవ కమిటీ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం...

**ఒక లక్ష 81 వేలు పలికిన లడ్డు ధర...51 వేలు పలికిన గల్లా పెట్టే ధర**




**తెలుగు వెలుగు ప్రతినిధి శేర్లింగంపల్లి:** శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని వివేకానంద నగర్ డివిజన్లో గల వెంకటేశ్వర నగర్ 35 బ్లాక్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని వద్ద నిమజ్జన కార్యక్రమం జరిగింది. వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షులు సిహెచ్ హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి గిన్ని ప్రవీణ్ సాగర్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వినాయక మండపం వద్ద లడ్డు వేలం పాటలో పలువురు పాల్గొనగా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు కల్లేపల్లి లక్ష్మణ్ ఒక లక్ష 81 వేల రూపాయలకు లడ్డూను వేలంపాడి దక్కించుకున్నారు. అలాగే గల్ల పెట్టిని వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు సిహెచ్ హనుమంతరావు 51 వేల రూపాయలకు పాడుకున్నారు. ఈ సందర్భంగా గణనాథుని ఊరేగింపు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. స్థానిక మహిళలు కమిటీ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు. వెంకటేశ్వర నగర్ నుండి బయలుదేరిన గణనాథుడు ఆల్విన్ కాలనీ మీదుగా కూకట్పల్లిలోని ఐడియల్ చెరువులో నిమజ్జనం చేశారు.


# గోవింద్ ముసిలయ్య సేవలు మరువలేనివి: ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

**ఘనంగా గోవింద్ ముసిలయ్య వర్ధంతి వేడుకలు**

**పాల్గొన్న సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,ఎమ్మె సత్యనారాయణ,జిల్లెల వెంకట్ రెడ్డి**



నందిగామ మండలం నర్సప్పగూడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్,మాజీ సర్పంచ్ మరియు ఎంపీటీసీ గోవింద్ ముసిలయ్య వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి పాల్గొని గోవింద్ ముసిలయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లార్పించారు. సర్పంచ్ గా ఎంపీటీసీగా గ్రామానికి ముసిలయ్య సేవలు మరువలేనివాని,అయన అడుగుజాడల్లో అయన కుమారులు నడవడం సంతోషకర విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,ఎమ్మె సత్యనారాయణ,మాజీ సర్పంచ్ జిల్లెల వెంకట్ రెడ్డి,పిఏసిఎస్ చైర్మన్ గొల్లపల్లి అశోక్,మాజీ చైర్మన్ మామిల్ల విట్టల్,మాజీ సర్పంచ్ లు యంపిటిసిలు గోవింద్ అశోక్,జెకె నరసింహ,జట్ట కుమార్,కట్న శ్రీశైలం బిఆర్ఎస్ నాయకులు జంగిలి కుమార్, సుదర్శన్ గౌడ్,శేఖర్,క్రిష్ణ గౌడ్, శ్రీధర్ గౌడ్,జె సురేందర్, రాజు,క్రిష్ణ,కె యాదగిరి, కే.భూపాల్, ఎంకిర్యాల నర్సిమా గౌడ్, జె మల్లేష్,ఈదులపల్లి నర్సిమ గౌడ్,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు..



# జర్నలిస్టుపై కాంగ్రెస్ వర్గీయుల ముకుమ్మడి దాడి

**పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన బాధితుడు సందీప్**

**దాడిని ఖండించిన నందిగామ టిడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టులు**



**నందిగామ:** మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి మద్యం మత్తులో కొందరు ఆదాబ్ హైదరాబాద్ రిపోర్టర్ చేన్నగళ్ళ సందీప్ పై దాడి చేసినట్లు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే తనపై దాడి దాడి చేసినట్లు రిపోర్టర్ సందీప్ పేర్కొన్నారు. సుమారు 11 గంటల సమయంలో ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రం సమీపంలో కొందరు యువకులు తప్ప తాగిన మైకంలో పరుష పదజాలంతో దూషిస్తూ తనపై దాడి చేసినట్లు చెప్పారు. జర్నలిస్టుపై దాడి సిగ్గు చేటని, ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడబ్ల్యూజెఎఫ్ నందిగామ మండల జర్నలిస్టులు డిమాండ్ చేశారు.

# వివిధ గణపతి మండపాల వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎర్రబెల్లి సతీష్ రావు...





**తెలుగు వెలుగు ప్రతినిధి శేర్లింగంపల్లి:** వినాయక నవ రాత్రుల ఉత్సవాల సందర్భంగా శేరిలింగంపల్లి నియోజికవర్గంలోని ఆదిత్య నగర్ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో, రామకృష్ణ నగర్ గణేశ్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఇతర కాలనీల్లో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొని విఘ్నేశ్వర స్వామికి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు, ఆయా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక భక్త బృందం గణనాథుని నిమజ్జనంలో పూజలు చేసిన కూకట్పల్లి నేతలు..



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కూకట్పల్లి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో 50 సంవత్సరాల నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం ఘనంగా నిమజ్జన కార్యక్రమం జరిగింది. బిజెపి కార్యాలయం వద్ద గల వినాయక మండపం నుండి బయలుదేరిన గణనాథుడు కూకట్పల్లి పురవీధుల్లో ఊరేగింపుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు గణపతి ర్యాలీలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె. సుదర్శన్ రావు, మర్యాద అశోక్, దుర్గా ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణగిరి గణపయ్య లడ్డు అక్షరాల ఆరు లక్షలు..

**45 కిలోల లడ్డూ వేలంలోను ప్రత్యేకత చాటిన స్వర్ణగిరి గణపయ్య**

**రూ.6.21 లక్షలకు లడ్డు కైవసం చేసుకున్న ప్రముఖ రియల్టర్ మధురాపూర్ గోవర్ధన్ రెడ్డి**

**లడ్డుతోపాటు కలశం అందుకున్న గోవర్ధన్ రెడ్డి**

**గణపతికి ఘనవీడ్కోలు పలికిన భక్తులు..**







షాద్ నగర్ పట్టణంలోనే అత్యంత ప్రత్యేకంగా కనిపించిన శ్రీ వివేకానంద సేవాసమితి (ఎస్ వి ఎస్ ఎస్) స్వర్ణగిరి గణపయ్యకు భక్తులు వీడ్కోలు ఘనంగా పలికారు. నవరాత్రుల్లో ప్రత్యేకతను చాటినట్లే లడ్డు వేలం పాటలో కూడా ఈసారి ప్రత్యేకతను చాటాడు ఈ గణపయ్య. ఇక్కడి గణపతి లడ్డును వేలంపాటలో ప్రముఖ రియల్టర్ మధురాపూర్, శేరిగూడ కు చెందిన మల్కయ్య గారి గోవర్ధన్ రెడ్డి రూ. రూ.6.21 లక్షలకు 45 కిలోలలడ్డూ కైవసం చేసుకున్నాడు. అలాగే లడ్డుతోపాటు కలశం అందుకున్నారు. అదేవిధంగా శ్రీకాంత్ ముదిరాజ్ రెండవ లడ్డును 258 వేలకు కవచం చేసుకున్నారు భక్తులు చెల్లించిన చందాలను లక్కీ డ్రా ద్వారా చిన్న లడ్డును కొత్తూరువాసి అశ్విత్ గెలుచుకున్నాడు. అదేవిధంగా టీం ఎస్ వి ఎస్ ఎస్ సభ్యులకు మొబైల్ అడ్డా వారు లక్కీ డ్రా ద్వారా ఆపిల్ ఫోన్ ను జాహ్నవి కి అందజేశారు. ఈ లక్కీ డ్రా ను ప్రముఖ పౌల్ట్రీ పారిశ్రామికవేత్త పాతూరి వెంకటరావు నిర్వహించి విజేతలకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేశ్వర రెడ్డి పినపాక ప్రభాకర్ ఎస్వీఎస్ఎస్ టీం సభ్యులు పట్టణ ప్రముఖులు భక్తులు తోపాటు పలువురు హాజరయ్యారు. అదేవిధంగా ఇక గణపతి దేవుని శాలువాను రూ.70 వేలకు సాత్విక్ సొంతం చేసుకున్నాడు. వివేకానంద సేవా సమితి గణేష్ మండపం ఆధ్వర్యంలో అత్యంత ఆసక్తికరంగా వేలంపాట జరిగింది. అనంతరం భక్తులందరూ కలిసి గణపతి దేవుడికి ఘన వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నవీన్ రెడ్డి, వేణుగోపాల చారి, నర్సింలు యాదవ్, రవి కుమార్ గుప్తా, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్ట్ పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి..

**నందిగామ ఆదాబ్ హైదరాబాద్ రిపోర్టర్ పై దాడిని ఖండిస్తున్నాం**

**టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్, నరేష్**








నందిగామ మండల ఆదాబ్ హైదరాబాద్ రిపోర్టర్ సందీప్ పై దాడిని టీడబ్ల్యూజేఎఫ్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్ గౌడ్, నరేష్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ గౌడ్, నరేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల పై దాడులు చేయడం సరైన విధానం కాదని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సందీప్ ఎదుగుదలను చూసి ఓర్వలేక ఇలాంటి దాడులకు పాల్పడడం ఏంటని విమర్శించారు. ఏవైనా సమస్యలు ఉంటే సామరస్యంగా మాట్లాడుకోవాలని, ఇలాంటి దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. దాడి కి పాల్పడిన వారు ఎవరైనా సరే వారిని గుర్తించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఘనంగా భక్తి శ్రద్ధలతో గణేష్ నిమజ్జనాలు





**తెలుగు -వెలుగు,తూ. గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** తూర్పుగోదావరి జిల్లాలో శనివారం జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు ఎంతో సందడిగా సాగాయి. ముఖ్యంగా ఆదివారం చంద్రగ్రహణం కారణంగా ఆ రోజుకి ఉత్సవ విగ్రహాలను ఉంచకూడదని వేద పండితులు సూచించడంతో భక్తులు ఆ విధానాన్ని పాటించి శనివారం నిమజ్జనానికి చివరి రోజు కావడంతో ప్రతి గణపతి ఆలయ కమిటీ నిమజ్జనానికి ఏర్పాటు చేసుకొని ఆ ప్రక్రియ పూర్తి చేయడం జరిగింది. అంతేగాక అనేక గణపతి మండపాల వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించగా వేలాదిమంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. బ్యాండ్ మేళాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లతో, యువత కేరింతలు, డాన్సు, వివిధ వేషధారణల మధ్య గణేష్ నిమజ్జనాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు.

# లక్కీ "డ్రా"లో సంతోషికి దక్కిన గణపతి లడ్డు




**తెలుగు - వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి):** తొమ్మిది రోజులు పాటు పూజలు అందుకున్న అనపర్తి శేషగిరిరావు పేటలోని బొజ్జ గణపతి నిమజ్జనం అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం బ్యాండ్ మేళాలు, డప్పు వాయిద్యాలు, వివిధ వేషధారణలతో ఊరేగుతూ బొజ్జ గణపతి నిమజ్జనం చేయడం జరిగింది. కాగా స్వామివారి లడ్డు లక్కీ డ్రా లో పడాల సంతోషి (టీచర్) గెలుచుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గణపతి మండప కమిటీ సభ్యులు పడాల సంతోషి, వానపల్లి వీరబాబు, తమలంపూడి శ్రీనివాసరెడ్డి, తమలంపూడి మాలతి, కర్రి సత్యనారాయణ రెడ్డి, శేశెట్టి కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గెస్ట్ లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** అశ్వరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెక్చరర్స్ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేసేందుకుగాను అతిథి అధ్యాపకుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్ గోపి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కళాశాల కమిషనర్ ఆదేశాలు మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న పొలిటికల్ సైన్స్(01), కామర్స్(01), ఎకానామిక్స్(01), హిస్టరీ (01), కెమిస్ట్రీ (1), బోటనీ (1) విభాగాలలో అతిథి అధ్యాపకుల నియామకం కొరకు ఈనెల 11న కొత్తగూడెం శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఇంటర్వ్యూ జరుగుతుందని అన్నారు. కావున అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు ఉండాలని, నెట్, సెట్, పిహెచ్‌డి కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 9వ తేదీలోపు పూర్తి బయోడేటాతో పాటు జతచేసిన సర్టిఫికెట్స్ అప్లికేషన్ ను సత్తుపల్లి జెవిఆర్ కళాశాలలో సమర్పించాలని పేర్కొన్నారు.

# రామకృష్ణ వీధి గణపతి మండపం వద్ద కుంకుమార్చన...



**తెలుగు వెలుగు ప్రతినిధి శేర్లింగంపల్లి:** రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ గణనాథుని పూజలు చివరి రోజు చాలా ఘనంగా సుమారు 200 మహిళలు సోదరీ సోదరీమణులచే కుంకుమార్చన కార్యక్రమము నిర్వహించారు. అదే విధంగా స్వామివారికి హారతి కార్యక్రమం ఎంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి కార్పొరేటర్ రోజా దేవి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి 200 మహిళలకు శాలువలతో సన్మాన కార్యక్రమము నిర్వహించారు. కనివిని ఎరుగని రీతిలో మహిళలకు కాలనీవాసులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుధాకర్ రావు శ్రీధర్ రావు, చంగల్ రెడ్డి, శ్రీనివాసరావు, జలంధర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని లడ్డు 25 వేలకు కైవసం చేసుకున్న ముస్లిం సోదరుడు సాజిద్



కేశంపేట మండలం పరిధిలోని సంతపూర్ గ్రామంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ముస్లిం సోదరుడుసాజిద్ గణనాథుని లడ్డు గ్రామంలో పలువురు వేలం పాటలో పోటీ పడగా చివరికి 25వేలకు సాజి శుక్రవారం కైవసం చేసుకున్నారు. తొమ్మిది రోజులుగా పవిత్రమైన పూజలు అందుకున్న గణనాథుని లడ్డు తను ఆసక్తితో కైవసం చేసుకున్నారు. కుల మతాలకు అతీతంగా ముస్లిం సోదరుడు ఆసక్తితో లడ్డు కైవసం చేసుకోవడం పట్ల గ్రామస్తులు ఎంతో అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు..

# వినాయక భక్త బృందం గణనాథుని ఊరేగింపులో పాల్గొన్న కూకట్పల్లి నాయకులు.



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కూకట్పల్లిలోని వినాయక భక్తబృందం ఆధ్వర్యంలో కూకట్పల్లి బిజెపి కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన అతిపెద్ద వినాయకుని నిమజ్జన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కూకట్పల్లికి చెందిన పలువురు నాయకులు నిమజ్జనం ఉపయోగింపు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, నాయినేని సూర్యప్రకాష్ రావు, పాపారావు, గునిగంటి వాసుదేవరావు, ఎర్రబెల్లి వాసుదేవరావు, జగత్ రావు, రామారావు పాల్గొన్నారు.

# లబ్దిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకులు



**తెలుగు వెలుగు ప్రతినిధి (ఏర్గట్ల మండలం)** ఏర్గట్ల మండలంలోని భట్టాపూర్ గ్రామంలో కొత్తగా వచ్చిన రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం స్థానిక కాంగ్రెస్ నాయుకులు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షేక్ కరీం మాట్లాడుతూ.. గ్రామం లో లబ్ధిదారులకు నూతన్ రేషన్ కార్డులు రావడంతో వారికి సన్న బియ్యం అందజేసినట్లు అయన అన్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రత్యక్షంగా ప్రజల పక్షం
ఆదివారం,
07 సెప్టెంబర్ 2025



# తెలంగాణ రాష్ట్ర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం: పి.రాములు నేత

**జహీరాబాద్ తెలుగు వెలుగు ప్రతినిధి సెప్టెంబర్ 6** జాగో తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకులు తేదీ 8-9-2025 నాడుమధ్యనం 2 గంటలకు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఈ సమావేశమునకు తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో జరుగును కావున తెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోరే ప్రజా సంఘాల నాయకులు రాజకీయ పార్టీల నాయకులు కార్మిక నాయకులు వ్యవసాయ కార్మిక నాయకులు స్వచ్ఛందంగా రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని సమావేశాన్ని దిగ్విజయం చేయగలరు సమావేశంలోని ముఖ్యంశాలు ఎప్పటికప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రజలను చైతన్యం చేయడం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఉత్తర భారత దేశానికి సంబంధించిన వర్తకులు కార్మికులు మన రాష్ట్రానికి వలస వచ్చి మన యొక్క వర్తకులను మన కార్మికులను మరియు వ్యవసాయ కార్మికులను వ్యాపార రంగంలో శ్రామిక రంగంలో కృంగదీస్తున్నారు దీని మూలంగా తెలంగాణ రాష్ట్రంలోని వర్తకులు



కార్మికులు వ్యవసాయదారులు అనేక రకాలుగా నష్టపోతున్నారు ఈ విషయాల పైన ప్రత్యేకమైన చర్చా ఉంటుంది అదేవిధంగా ఇంకా కొంతమంది ఉత్తరభారతీయులు రాష్ట్రం లోపల అనేక రకాల మోసాలకు పాల్పడుతూ ప్రజలను మోసం చేస్తున్నారు ఉదాహరణకు నకిలీ వస్తువుల విక్రయం కల్తీ తినుబండ రాళ్ల తయారీ చేస్తూ మోసపూరితమైన స్కీమ్ లతో వ్యాపారం చేస్తూ తెలంగాణ రాష్ట్రంలోని సామాన్య ప్రజలకు అనేక రకాలుగా అనారోగ్యాలకు గురి చేయడమే కాకుండా వారికి నకిలీ వ్యక్తులు విక్రయించి వారి ధనాన్ని కూడా దోచుకెళుతున్నారు అనేక సందర్భాలలో రకరకాల మోసపూరిత వ్యాపారాలు నిర్వహించి తెలంగాణ సామాన్య ప్రజానీకానికి పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారు ఇట్టి విషయాల మీద ప్రత్యేకమైన చర్చ అదేవిధంగా భవిష్యత్ కార్యాచరణ తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయస్ కోసం అనేక రకాల ప్రజా సంఘాలు వారికి తోచిన విధంగా తమకు తామే వాళ్లకు ప్రజా సంఘాన్ని నామకరణం చేసుకొని ముందుకెళుతున్న సంగతి తెలిసినదే అయినప్పటికిని ఏది ఏమైనా ప్రతి సంఘం యొక్క లక్ష్యం తెలంగాణ ప్రజల రక్షణ తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమం కాబట్టి ఎవరు ఏ రకంగా ముందుకు వెళ్లిన అందరం కూడా మాసానికి ఒకసారి రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా ఏకమై ముందుకు కదలాలని కార్యచరణలో భాగంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగినది ఇటి సమావేశానికి అందరూ కూడా సమయపాలన పాటించి స్వచ్ఛందంగా పాల్గొని దిగ్విజయం చేయగలరని కోరుకుంటున్నా ము కార్యక్రమంలో వడ్డెర యువజన సంఘం నాయకులు పల్లపు శేఖర్ మాల మహానాడు డివిజన్ సెక్రెటరీ ధనరాజ్ జాగో తెలంగాణ కార్యవర్గ సభ్యులు మహమ్మద్ ఇమ్రాన్ ప్యార్ల దశరథ్ మాదినం శివ జాగో తెలంగాణ విద్యార్థి నాయకులు కార్తీక్ రామ్ చరణ్ బాలకృష్ణ రవి కిషోర్ విష్ణు గార్లు పాల్గొన్నారు

# కూటమి నేతల కను సన్నల్లోనే యూరియా దందా

## అన్నదాత గోడు పట్టించుకోని దుర్మార్గపు ప్రభుత్వం: మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి

**తెలుగు-వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):**అన్నదాతల పట్ల చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అంతేకాక మొద్దునిద్ర పోతుందని ఈ ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్సిపి ఆందోళనలు చేపట్టనుందని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం అనపర్తి వైసిపి కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్ మాజీ ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న తూర్పుగోదావరి జిల్లా ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేయనున్నామని స్పష్టం చేశారు. కూటమి నేతల కనుసన్నల్లో యూరియా బ్లాక్ దందా కొనసాగుతోందని యూరియా అడిగిన రైతులపై ప్రభుత్వం వేధింపులు సాగిస్తుందని మాజీ ఎమ్మెల్యే సత్తి అన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్లో కూటమి నేతలు కోట్లు దండుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. దుర్మార్గపు ప్రభుత్వంపై రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్సిపి పోరాడుతుందని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. వైయస్ జగన్ నాయకత్వంలో గత ఐదేళ్ల పాలనలో వ్యవసాయ రంగం ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తి



రామకృష్ణారెడ్డి (రాంబాబు), సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, ఇమ్మంది విజయ కుమారి, కొండేటి భీమేష్, తిరగటి శివ, తుమ్మ సత్తిబాబు రాజేశ్వరి, బొడ్డు సునీత, చింతా రామారావు, మాచర రావు, మేడపాటి శివశంకర్ రెడ్డి, నంది కోళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్టీపై మోడీ ప్రభుత్వం తీసుకున్నది సంచలన నిర్ణయం...

**- దేశానికి స్వాతంత్రం వచ్చాక ప్రజలందరూ ఉపయోగించుకునే 80 శాతం వస్తువులపై ద టాక్స్ తగ్గింపు ఇదే మొదటిసారి...**

**- నిత్యావసర వస్తువులకు 5 శాతం సాధారణ వస్తువులకు 18 శాతం, విలాసవంతమైన, హానికరమైన వస్తువులకు 40 శాతం తో జిఎస్టిలో మార్పులు.**

**- నాలుగు పన్ను శ్లాబులను రద్దు చేసి,ఒక సరళమైన మూడు అంచెల విధానాన్ని తీసుక వచ్చి, పన్ను భారాన్ని తగ్గించిన ప్రధాని మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు...**

**- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర**

**కరీంనగర్ జిల్లా,సెప్టెంబర్6:**భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2025లో ప్రకటించనున్న గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ( జిఎస్టి ) రేట్ల తగ్గింపులు దేశ ఆర్థిక విధానానికి, వినియోగదారుల ఖర్చులలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలకనున్నాయని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. శనివారం రోజున కరీంనగర్లో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చాక ప్రజలందరూ ఉపయోగించుకునే 80 శాతం వస్తువులపై టాక్స్ తగ్గింపు ఇదే మొదటిసారి అని తెలిపారు. ముఖ్యంగా గతంలో ఉన్న నాలుగు పన్ను శ్లాబులను రద్దు చేసి, ఒక సరళమైన మూడుఅంచెల విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని, నిత్యావసర వస్తువులకు 5 శాతం, సాధారణ వస్తువులకు 18 శాతం, విలాసవంతమైన, హానికరమైన వస్తువులకు 40 శాతం తో జిఎస్టి వర్తించేలా మార్పులు చేపట్టి, ప్రజలకు, వినియోగదారులకు మేలు జరిగేలా మోడీ ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందన్నారు. ఈ నిర్ణయం వల్ల భారతీయ ప్రజలందరికీ,వినియోగదారులకు, వ్యాపారాలకు నేరుగా ప్రయోజనం చేకూర్చనుందన్నారు. ప్రధానంగాగతంలో అత్యధికంగా ఉన్న 28 శాతం శ్లాబును పూర్తిగా తొలగించారని, పాన్ మసాలా, గుట్కా, సిగరెట్లు, బీడీలు, లగ్జరీ వస్తువులు, జూదం వంటి కొన్ని వస్తువులకు మాత్రమే 40 శాతం జిఎస్టి వర్తించనుందని తెలిపారు. గృహోపకరణాలు




వంటి వాటిపై జీఎస్టీ 12 శాతం, 18 శాతం నుండి కేవలం 5 శాతం కి తగ్గిందన్నారు. టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్ల వంటి ఉపకరణాలపై గతంలో ఉన్న 28 శాతం జీఎస్టీ ఇప్పుడు 18 శాతం కి తగ్గిందని , దీంతో ఈ వస్తువులు గణనీయంగా చౌకగా లభించనున్నాయన్నారు. హెల్త్ సెక్టార్ లో ప్రజలకు ఊరట నిచ్చే విధంగా మార్పులు జరిగాయని,మెడిసిన్స్ ఇకపై చౌకగా లభించనున్నాయన్నారు. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలకు జీఎస్టీ నుంచి మినహాయింపు లభించడం గొప్ప విషయమన్నారు. ఈ రేట్ల తగ్గింపుల వల్ల కేంద్ర ప్రభుత్వం ఏటా వేల కోట్ల ఆదాయం కోల్పోతున్న ప్రజల మేలు, సంక్షేమం కోసం మాత్రమే మోడీ ప్రభుత్వం ఆలోచన చేసి జిఎస్టిలో పెనుమార్పులు చేపట్టిందన్నారు. ముఖ్యంగా నిత్యావసర వస్తువులపై పన్నులు తగ్గించడం వల్ల వినియోగదారుల చేతిలో డబ్బు మిగిలి, డిమాండ్ పెరుగుతుందని, దేశీయ మార్కెట్లు మరింత ఆకర్షణీయంగా మారి, దేశీయ వస్తువులకు డిమాండ్ పెరిగి, ఉత్పత్తిదారులకు, వ్యాపారులకు తగిన మద్దతు లభిస్తుందన్నారు. అలాగేప్రపంచ వ్యాపారాలకు భారత మార్కెట్ ఒక ఆకర్షణ గా నిలవబోతుందన్నారు. ప్రధానంగా మోడీ ప్రభుత్వం అంతర్జాతీయ సుంకాల ప్రభావాన్ని తట్టుకోవడానికి, దేశ ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తు, వినియోగదారుల పన్ను భారాన్ని తగ్గించడానికి చర్యలు చేపట్టిందన్నారు. రాబోయే కొన్ని నెలల్లో ఈ సాహసోపేతమైన సంస్కరణలు ఎంత ప్రభావవంతం గా ఉంటాయో ప్రపంచ దేశాలకు అర్థమవుతుందన్నారు. జీఎస్టీ పై సంచలన నిర్ణయం తీసుకొని, ప్రజలకు వినియోదారులకు పన్ను భారాన్ని తగ్గించిన ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్,కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

# ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే సత్తి





**తెలుగు -వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో (అనపర్తి):**రాజమహేంద్రవరం సెంటర్ జైల్లో ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎంపీ మిథున్ రెడ్డికి ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు మధ్యంతర బెయిల్ లభించింది. శనివారం మధ్యంతర బెయిల్ పై విడుదలైన ఎంపీ మిథున్ రెడ్డిని సెంట్రల్ జైలు వద్ద అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి కలిసారు.కాగా ఈనెల 11 న తిరిగి సరెండర్ కావాలని మిథున్ రెడ్డిని కోర్టు ఆదేశించింది.ఇంకా ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన వారిలో వైసిపి మాజీ ఎమ్మెల్యేలు చిర్ల జగ్గి రెడ్డి, తలారి వెంకటరావు, అమలాపురం పార్లమెంట్ పరిశీలకరాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎంపీ చింతా అనురాధ, పినిపే శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# రూ.2లక్షలు పలికిన లక్ష్మిగణపతి లడ్డు



**తెలుగు వెలుగు ప్రతినిధి, అశ్వారావుపేట:** మండల కేంద్రం అశ్వారావుపేట బస్టాండ్ సెంటర్లో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మిగణపతి ఆలయంలో 37వ వార్షికోత్సవ వేడుకల నేపథ్యంలో స్వామివారి సన్నిధిలో గత 10రోజులుగా విశేష పూజలందుకున్న లడ్డూను వేలంపాట నిర్వహించగా రూ.2లక్షలకు స్థానిక విజయసాయి సెల్‌వరల్డ్ శీమకుర్తి జితేంద్ర పాడి దక్కించుకున్నారు. అనంతరం స్వామి నిమజ్జన మహోత్సవం పట్టణ పురవీధుల్లో ఘనంగా జరిగింది. విచిత్రవేషధారణలతో, బాణసంచా కాల్చుతూ శ్రీ లక్ష్మిగణపతి స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది.

# వైస్ చైర్మన్ వెంకటరెడ్డిని సత్కరించిన ఎమ్మెల్యే, మనోజ్



**తెలుగు-వెలుగు,తూ.గో.జిల్లా బ్యూరో(అనపర్తి):**అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఇటీవల నియమితులైన అనపర్తి నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోనాల వెంకట రెడ్డి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, యువ నేత నల్లమిల్లి మనోజ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అనపర్తి మండలం రామవరంలో వైస్ చైర్మన్ కోనాల వెంకట రెడ్డిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మనోజ్ రెడ్డి శాలువా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# ఎంపీటీసీ వారీగా ముసాయిదా ఓటర్ లిస్ట్ విడుదల

## - ఏ రాములు రామన్నపేట ఎంపీడీవో

**రామన్నపేట సెప్టెంబర్ 6:**ఎంపీటీసీ వారిగా ముసా యిదా ఓటర్ లిస్ట్ ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితా మం డల ప్రజా పరిషత్తు కార్యాలయం రామన్నపేట నోటీసు బోర్డులో అన్ని ఎంపీటీసీలలోని గ్రామ పంచాయతిలలోడిస్ప్లే చేయనైనది.

తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం



# అంబ పలుకుతోంది.. పంబ రేగుతోంది..!

**షాద్ నగర్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల మధ్య సవాళ్ల పర్వం..**

**నీ ఆస్తులు ఎంత.. నా ఆస్తులు ఎంత..**

**మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సవాల్..**

**ఎమ్మెల్యే శంకర్ మీడియా సమావేశం తరువాత ఆసక్తికర పరిణామాలు..**

**మాజీ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నాయకుల కౌంటర్..**

**షాద్ నగర్ అసెంబ్లీలో రాజకీయం గర్మాగరం..**

**ఏం జరుగుతోందిక్కడ.. రాజకీయాలపై జనంలో ఆసక్తి..**

**ఇంతింతై పెరుగుతున్న రాజకీయ రగడ..**

**షాద్ నగర్‌లో కాంగ్రెస్ వర్సెస్ బిఆర్ఎస్**





ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నోట కుంభ పలుకు జగదంబ పలుకు అంటూ ఇటీవలే మీడియా సమావేశంలో ఈ పదాలను ఉపయోగించారు. ఇప్పుడు అంబ పలికింది.. దీనితో రాజకీయ పంబ రేగుతోంది.. మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ చేసిన ప్రతి విమర్శ, సవాల్ షాద్ నగర్ రాజకీయాన్ని మరింత గర్మాగరంగా మార్చింది.. కాంగ్రెస్, బిఆర్ఎస్ కౌంటర్లు.. ఎన్కౌంటర్ల మధ్య రాజకీయ వేడి రగులుతోంది.. ముఖ్యంగా నీ ఆస్తులు ఎంత.. నా ఆస్తులు ఎంత.. అన్న సవాలు ప్రస్తుత రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.. అసలు షాద్ నగర్ నియోజకవర్గంలో ఏం జరుగుతోంది.. నాకు తెలియాలి.. అనే రీతిలో జనంలో రోజురోజుకు ఈ టాపిక్ ఆసక్తికరంగా మారుతుంది. నిజంగా అసలు ఏం జరుగుతోంది.. **ముందు జరిగింది ఇదీ..** తన జీవితంలో చాలా మంది ఎమ్మెల్యేలను చూశానని కానీ ఇక్కడ మాత్రం ఒకాయన దోపిడీకి అడ్డు అదుపు లేకుండా పోయిందని ఎమ్మెల్యే శంకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. షాద్ నగర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ప్రతిపక్ష బిఆర్ఎస్ దగ్ధం చేయడం పట్ల ఆయన తీవ్రంగా స్పందించారు. తను ఏ ఎమ్మెల్యేను ఇంత అవినీతి చేయడం అక్రమాలకు పాల్పడిన దాఖలాలు చూడలేదని కొందరు సత్యహరిశ్చంద్రులా మాట్లాడతారని సుద్దపూసల మాట్లాడుతూనే కోట్ల రూపాయల అవినీతి అక్రమాలు బెదిరింపులకు పాల్పడ్డారని ఎమ్మెల్యే శంకర్ కొందరిపై పరోక్షంగా ధ్వజమెత్తారు. చరిత్రలు చెరిస్తే పోయేటివి కావనీ ప్రజలు అందరి చరిత్రలు తెలుసుకుంటారని అవి ఎక్కడికి పోవని అన్నారు. దోపిడి ఎజెండాగా పెట్టుకుని పదేళ్లపాటు సిగ్గు లేకుండా దోచుకొని ఇప్పుడు తగుదునమ్మా అని నీతి మాటలు మాట్లాడితే ప్రజలు హర్షించరని ఎమ్మెల్యే హితవు పలికారు. మిమ్మల్ని ప్రజలే కాదు ఆ దేవుడు కూడా క్షమించడని ఎమ్మెల్యే అన్నారు. మీరు చేసిన అవినీతి అక్రమాలు అన్ని ఇన్ని కావనీ అన్నింటిని ఆ పైవాడు చూస్తున్నాడని అందుకే పోయేకాలం దాపురించిందని ఎమ్మెల్యే నానా శాపనార్థాలు పెట్టారు. కొందరు వెదవలు కాళేశ్వరం ప్రాజెక్టుపై అవినీతి జరిగితే జరగలేదని సుద్ధపూసల్లా మాట్లాడుతున్నారని, సీఎం దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్నారని అవగాహన లేని వెదవ సన్యాసులు అని ఎమ్మెల్యే రాజకీయంగా తులనాడారు. బిఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఇలాంటి నాయకుల గురించి గ్రహించాలని వారి కబంధ హస్తాల్లో చిక్కి భవిష్యత్తు అంధకారం చేసుకోకూడదని సూచించారు. అధికారం ఉన్నప్పుడు ఎవరిని పట్టించుకోకుండా ఇష్టం వచ్చిన అక్రమాలు చేసి ఇప్పుడు రోడ్డుపై సిగ్గు లేకుండా ఆందోళన చేపడుతున్నారని అసలు ఈ ఆందోళనలు ఎందుకని ప్రశ్నించారు. కెసిఆర్ చేసిన అవినీతిపై జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఇస్తే కోర్టుకు ఎందుకు వెళ్లారు చెప్పాలని డిమాండ్ చేశారు. గత పాలకుల అవినీతి అక్రమాలపై అంబ పలుకు జగదంబ పలుకు అంటూ పదాలు ప్రయోగించారు. **గొడవ ముదిరిందిలా..** దీనిపై స్పందించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఇటీవల మీడియా సమావేశం ఏర్పాటు చేసి తాను అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ఎలాంటి శిక్షకైనా సిద్ధమే అంటూ ప్రకటించారు. రసీదు తప్పితే మసీదు అంటూ రామేశ్వరం, భవాని మాత.. ఏ ఆలయానికి రమ్మన్నా వస్తాను... నా ఆస్తుల వివరాలు ఇస్తాను.. మీ ఆస్తుల వివరాలు కూడా ప్రకటించు.. ఎవరు ఏమిటో తేలుతుంది.. అంటూ డైరెక్ట్ గా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు సవాల్ విసిరారు. దీనితో రాజకీయ ప్రభంజనం మొదలైంది. దీనిపై కింది స్థాయినేతల్లో కూడా నువ్వా నేనా అనే రీతిలో విమర్శలు ప్రారంభమయ్యాయి. తాజాగా కాంగ్రెస్ నాయకులు బాబర్ ఖాన్, రఘు, పురుషోత్తం రెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి అసలు మాజీ ఎమ్మెల్యే గురించి ఎమ్మెల్యే మాట్లాడనేలేదని, గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు ఎందుకు తరిమేసుకుంటున్నారు అని, ఇదంతా మాజీ ఎమ్మెల్యే అంజయ్య స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం కోసమే మీడియా సమావేశం అని కొట్టి పారేశారు. కాసేపు రాజకీయాలు పక్కన పెడదాం.. ఈ గొడవల నేపథ్యంలో ప్రజలు ఏమనుకుంటున్నారు.. ఒకసారి చూద్దాం.. **"సేవ చేశారా.. సేవ్ చేశారా.. ప్రజలకు షేవ్ చేశారా.." ..** మంచి డైలాగులు.. ఫైటింగులు.. ఊహించని ట్విస్టులు ఉన్నాయంటే చాలు జనం సినిమాను ఆసక్తిగా చూస్తారు.. సీరియల్ అయినా అంతే.. ప్రస్తుతం ఒక సీరియల్ లాగ కొనసాగుతున్న ఈ రాజకీయ సినిమాని జనం ఆసక్తిగా గమనిస్తున్నారు. ఎందుకంటే ఇందులో రెండు పార్టీల మధ్య డైలాగులు బ్రహ్మాండంగా పేలుతున్నాయి. ఆస్తుల విషయంలో మంచి ట్విస్ట్ కూడా కనిపిస్తుంది. అదేవిధంగా కిందిస్థాయి నేతల్లో ఫైటింగులు కూడా జరుగుతున్నాయి. అందుకే జనాలు ఆసక్తికరంగా ఈ వైపు చూస్తున్నారు.. కొందరు రాజకీయ విశ్లేషకులు మాత్రం ఆస్తుల వివాదం ఎందుకు అంటూ ప్రశ్నిస్తున్నారు.. కానీ జనం కోణంలో ఆలోచిస్తే "అధికారంలోకి వచ్చిన నాయకులు తాము పని చేసిన అంతకాలం సేవ చేశారా.. సేవ్ చేశారా.. ప్రజలకు షేవ్ చేశారా.." అన్నది కచ్చితంగా తెలియాల్సిందే. అందుకే ఎన్నికల సమయంలో కూడా ఎన్నికలకు ముందు ఉన్న ఆస్తులు, తర్వాత ఉన్న ఆస్తుల గురించి తెలిసేలా అఫిడవిట్ అడగడం ఎన్నికల కమిషన్ నిబంధన కూడా. అలాగే ప్రజాధనం సక్రమంగా వినియోగం అవుతుందా.. నాయకుల అవినీతితో దుర్వినియోగం అవుతుందా.. అన్నది కూడా ప్రజలకు తెలియాల్సిందే. మరి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ సవాలును స్వీకరిస్తాడా.. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సవాలు మీదే నిలబడతాడా.. భవిష్యత్తులో ఇంకా ఎలాంటి ఆసక్తికరమైన ట్విస్ట్ లు ఈ సీరియల్లో ఉండబోతున్నాయి.. ప్రజలకు వాస్తవాలు తెలియాలి.. పిక్చర్ అభి బాకీ హై..!



# అది ప్రభుత్వ కార్యాలయమా.. గెస్ట్ హౌసా..

**ఎమ్మెల్యే కార్యాలయంలో మీ ప్రెస్ మీట్‌లు ఏమిటి..**

**మా మీద విమర్శలు కాదు.. మీ అభివృద్ధి ఏమిటో చెప్పండి..**

**ఎమ్మెల్యే.. అంజన్నను విమర్శించింది వాస్తవం కాదా..**

**వీడియోలు ప్రదర్శించిన బీఆర్ఎస్ నాయకులు..**

**అభివృద్ధిపై చర్చకు సిద్ధమంటూ సవాల్..**

**"తోకలు" కాదు ఎమ్మెల్యే మాట్లాడాలి..**

**ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి ఇలా విష ప్రచారాలు చేయడం సంస్కారం కాదు**

**ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులకు కొబ్బరికాయలు కొడుతూ బిల్డప్ లు..**

**కాంగ్రెస్ నాయకులకు షాద్ నగర్ బీఆర్ఎస్ నేతల చురకలు..**

**మీడియాతో మాట్లాడిన ఈట గణేష్, ఎమ్మెస్ నటరాజన్, బచ్చలి నర్సింహులు**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారిక కార్యాలయం.. అక్కడ ఎమ్మెల్యే మాత్రమే ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడాలి.. కానీ ఏం సంబంధంలేని ఆయన తోకలు కార్యాలయాన్ని గెస్ట్ హౌస్ గా మార్చుకున్నారు.. అక్కడ కూర్చుని ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు.. దమ్ముంటే చర్చలకు రండి.. మా అభివృద్ధి ఎంతో.. మీ అభివృద్ధి ఎంతో తేల్చుకుందాం.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.. మా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పై అవినీతి ఆరోపణలు చేశారు.. మా దగ్గర సాక్షాలు ఉన్నాయి.. ఎన్నికల కోసం తపిస్తున్నది మేము కాదు.. మీరే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మేము చేసిన పనులకు కొబ్బరికాయలు కొడుతున్నారు.. అంటూ బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ నేతలపై ధ్వజమెత్తారు. ఓవైపు ఎమ్మెల్యేను గౌరవిస్తూనే మిగతా నేతలను దుమ్మెత్తి పోశారు. బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నేతలు ఈట గణేష్, ఎమ్మెస్ నటరాజన్, బచ్చలి నర్సింహులు మాట్లాడగా లక్ష్మణ్ నాయక్, రవి యాదవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా నాయకులు మాట్లాడిన మాటలు ఇవి. **బుకాయించకండి.. వీడియోలు చూడండి.. ఎమ్మెస్ నటరాజన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు** ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా చివరికి ప్రభుత్వ కార్యక్రమాలలో కూడా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మీద అవినీతి ఆరోపణలు చేశారు. అందుకు తగ్గ వీడియో సాక్షాలు చూడండి.. అంటూ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎమ్మెస్ నటరాజన్ వీడియోలను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ 21 నెలలుగా అధికారంలో ఉంటూ నియోజకవర్గం అభివృద్ధి గురించి మాట్లాడకుండా ఎక్కడ పోయినా మాజీ ఎమ్మెల్యే అవినీతిపరుడు అంటూ ఆయన బిడ్డల గురించి ఆరోపణలు చేయడం ఎమ్మెల్యేకు తగదని హితవు చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతాడని అనుకుంటే ఆయన తోకలు మాట్లాడారు.. వాళ్లకు ఏమాత్రం సబ్జెక్టు తెలియదు.. కుక్కల్లా మొరుగుతున్నది ఎవరో అక్కడే అర్థమయిపోతుంది.. అంటూ చురకలు వేశారు. దాదాపు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరోపణలు చేస్తున్నప్పటికీ మాజీ ఎమ్మెల్యే ఒక్కసారి మాత్రమే స్పందించారని అన్నారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి ఇలా విష ప్రచారాలు చేయడం సంస్కారం కాదని అన్నారు. సమయం సందర్భం లేకుండా ఎక్కడ పడితే అక్కడ ఆరోపణలు చేయడం ద్వారా ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. గతాన్ని తవ్వడం ఊతపదంలా మార్చుకున్న నాయకులు భవిష్యత్తులో ప్రజలకు ఏం చేయబోతున్నారు చెపితే బాగుంటుందని సలహా ఇచ్చారు. **అంజన్న జపం మాని పని చూసుకోండి.. జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్** అధికారంలోకి వచ్చాక ప్రజలు, ప్రగతి గురించి ఆలోచించకుండా నిత్యం అంజన్న జపం చేస్తూ కాంగ్రెస్ నాయకులు కాలం వెళ్లదీస్తున్నారని జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్ అన్నారు. ఆయన మాట్లాడుతూ గత పది ఏళ్లు అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే ఒక్కరిని కూడా విమర్శలు చేయలేదని, ఒక్క రూపాయి కూడా ఎక్కడ ఆశించలేదని అన్నారు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే పనులను పక్కనపెట్టి కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదన్నారు. ఒకవేళ అంజన్న హయాంలో అవినీతి జరిగి ఉంటే ఎలాంటి విచారణకైనా పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ నాయకులు ఈ సవాల్ ను స్వీకరించాలని అన్నారు. అంజయ్య యాదవ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలకే కొబ్బరికాయలు కొడుతూ బిల్డప్ లు ఇస్తున్నారని మండిపడ్డారు. ముగ్గురు అన్నదమ్ముల మధ్య 100 ఎకరాల పొలం ఉంటే అది సీలింగ్ చట్టం కిందికి రాదు అనే కనీస అవగాహన కూడా కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. అంజన్న తన సొంత భూములను దానం చేశాడు తప్ప ఎక్కడా భూములు ఆక్రమించలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టే విధానం మానుకోవాలని, వ్యక్తిగత విమర్శలు చేయడం సంస్కారం కాదని గుర్తుంచుకోవాలని సూచించారు. **మా అంజన్నలా పని చేయండి చూద్దాం.. బీఆర్ఎస్ నేత బచ్చలి నర్సింహులు** పదేళ్ల కాలంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ 4600 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టారు. మీ దమ్ముంటే ఆయనలా అభివృద్ధి చేయండి. అంతేకానీ ఆరోపణలు చేస్తూ సమయం వృధా చేసుకోవద్దు అంటూ బీఆర్ఎస్ నాయకుడు చెట్ల నర్సింహులు ధ్వజమెత్తారు. తన వార్డులో 95% అభివృద్ధి అంజన్న హయాంలోనే జరిగిందని, ప్రస్తుతం ఎన్నికల కోసం హడావిడిగా రోడ్లు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు తవ్వి వదిలేయడం వల్ల జనాలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అంజన్న హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రస్తుత మీ కౌన్సిలర్ సర్వర్ పాషను అడిగి తెలుసుకోండి.. అని సూచించారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి 90 గాళ్లు, పాన్ పరాగ్ గాళ్లు అంటూ విమర్శించడం ఆయన స్థాయికి తగదని హితువు చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు తెచ్చిన టిడిఎఫ్ నిధులు కూడా అంజన్న హయాంలోనే మంజూరు చేశారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు సహనం కోల్పోయి మాట్లాడకండి.. నిజాలు తెలుసుకొని మాట్లాడండి.. ప్రజల్లో మీకున్న విలువను దిగజార్చుకోవద్దు.. వ్యక్తిగత విషయాల జోలికి రావద్దు అంటూ హెచ్చరించారు.

# కూటమి ప్రభుత్వం రైతులపై ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే నల్లమిల్లి

- **ఇరవై నాలుగు గంటలు లోపే సొమ్ము చెల్లించిన ఘనత మాది**



**తెలుగు -వెలుగు, తూ గో జిల్లా బ్యూరో (అనపర్తి):** కూటమి ప్రభుత్వం రైతుకు సంబంధించిన అన్ని విషయాల్లో ప్రత్యేకమైన శ్రద్ధ వహించడం జరుగుతుంది. గత ప్రభుత్వానికి భిన్నంగా హామీ ఇచ్చిన విధంగా సీఎంఆర్ కి అమ్మిన ధాన్యం సొమ్ము 48 గంటలకు చెల్లిస్తామని చెప్పి 24 గంటలలోపే చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తి ఎమ్మెల్యే కార్యాలయంలో బిక్కవోలు, రంగంపేట, పెదపూడి, అనపర్తి మండలాలకు సంబంధించిన వ్యవసాయ శాఖ అధికారులు, అనపర్తి అసిస్టెంట్ డైరెక్టర్, పిఏసిఎస్, సీఈఓ లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యూరియా కొరతపై వైఎస్ఆర్సిపి తప్పుడు ప్రచారం చేస్తుందని రైతుల పట్ల గత ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అన్న విషయం రైతాంగానికి అందరికీ తెలిసిన విషయమే అన్నారు. ప్రస్తుతం ఉన్న యూరియా పై ఒకసారి సమీక్షించుకోవడం జరిగిందని భవిష్యత్తులో కావలసిన యూరియా రెండు మూడు రోజుల్లో సేకరించడం జరుగుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి తెలిపారు. యూరియా కొరత అనేది ఒక ఏపీలోనే కాదని యావత్తు దేశవ్యాప్తంగా ఉందని తెలంగాణలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే వివరించారు. రైతు భరోసా రూ.15 మీరు ఇస్తానని ఆనాడు జగన్మోహన్ రెడ్డి హామీ ఇవ్వడం జరిగిందని కానీ కేంద్ర ప్రభుత్వం 6 వేలు ఇస్తే దానికి 7,500 కలిపి 13 వేల 500 మాత్రమే ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంలో కేంద్రం ఇచ్చే 6 వేలుకు 14 వేలు కలిపి మొత్తం రూ.20 వేలు ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. ఇంకా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు పసలేని, నిరాధార ఆరోపణలు చేయవద్దని ఎమ్మెల్యే మనల్ని హితవు పలికారు.

# చంద్ర గ్రహణం కారణంగా 7న సాయంత్రం గండి ఆలయం మూసివేత

**● గండి ఆలయ సహాయ కమీషనర్ జె వెంకటసుబ్బయ్య**



**వేంపల్లె సెప్టెంబర్ 06:–** చంద్ర గ్రహణం కారణంగా గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయాన్ని ఆదివారం సాయంత్రం 4 గంటల నుండి మూసి వేస్తున్నట్లు గండి ఆలయ సహాయ కమీషనర్ జె. వెంకటసుబ్బయ్య , గండి ఆలయ పాలకమండలి చైర్మన్ కావలి కృష్ణ తేజ లు తెలిపారు. తిరిగి 8 వ తేది సోమవారము తెల్లవారుజామున సంప్రోక్షణ చేసి ఉదయం 5 గంటల నుండి ఆలయము తెరచి సుప్రభాతం, పుణ్యాహవాచనం, ఆలయ శుద్ధి, స్వామివారి పంచామృత అభిషేకం, స్వామివారి ఆరాధన నివేదన చేసిన అనంతరం ఉదయం 7 గంటల నుండి భక్తులకు వీరాంజనేయ స్వామి సర్వదర్శనం ప్రారంభం అవుతుందని తెలిపారు. గ్రహణ సమయములో కుంభరాశిలో శతభిషం, పూర్వభద్రా నక్షత్రాలలో సంభవించును. కావున వీరు గ్రహణ అనంతరము చంద్రగ్రహణ శాంతి చేసుకోవాలి. వీరు గ్రహాణాన్ని చూడకూడదని సహాయ కమీషనర్ జె. వెంకటసుబ్బయ్య తెలిపారు.

# రాష్ట్ర ఆరోగ్య వైద్య విద్య శాఖ మంత్రి సత్తి కుమార్‌కు ఘన స్వాగతం పలికిన కూటమి నాయకులు



**ఓబులవారిపల్లి /రైల్వేకోడూరు సెప్టెంబర్ 06:–** రైల్వేకోడూరు నియోజకవర్గంలో స్థానిక కస్తూరి విశ్వనాథ నాయుడు టిడిపి కార్యాలయంలో రాష్ట్ర ఆరోగ్య వైద్య విద్యాశాఖ మాత్యులు సత్తి కుమార్ మరియు బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగోతు రమేష్ నాయుడుకి టిడిపి కూటమి నాయకులు కస్తూరి విశ్వనాథ నాయుడు రీరి రమణయ్య మరియు విశ్వేశ్వర నాయుడు పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు అనంతరం రైల్వే కోడూరు నియోజకవర్గ సమస్యలపై తెలియజేశారు అన్ని విధాల ఆదుకోవాలని రైల్వే కోడ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందే విధంగా అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి రైల్వే కోడూరు నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించాలని వారు విన్నవించారు అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో మాట్లాడి రైల్వే కోడూరు కి అన్ని వసతులు కల్పించే విధంగా చొరవ చూపుతామని ఆయన తెలిపినట్లు సమాచారం ఈ కార్యక్రమంలో టిడిపి ఓటమి నాయకులు కార్యకర్తలు నాయుడురీరి రమణయ్య పాపయ్య సుబ్రహ్మణ్యం రాజా శివయ్య లుగారి సుబ్బారా యు డు బిజెపి ప్రశాంత్ రెడ్డి రూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి సెప్టెంబర్ 06:–** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి. అనంతరం నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ వరాలను సిద్ధింప చేసే వరసిద్ధి వినాయక నవరాత్రి వేడుకలు ఉత్సాహానికి, ఉజ్వల సాంప్రదాయానికి ప్రతీక అని అన్నారు. ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకలని గంగాధర్ రెడ్డి అన్నారు. యువత గణేశ మండపాల ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. గణనాథుని ఆశీస్సులతో గచ్చిబౌలి డివిజన్ ప్రజలు అభివృద్ధి, శ్రేయస్సు సాధించాలని కోరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, స్థానిక నేతలు, భక్తులు, మహిళలు, పిల్లలు, కాలనీ వాసులు, కార్యకర్తలు, గణేష్ మండపాల నిర్వహకులు, గణేశ భక్తులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేది గురువే...



**దేవనకొండ సెప్టెంబర్ 06:–** విద్యార్థుల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దేది గురువులేనని టీచర్ రంగస్వామి, ఉచ్చరప్ప రఘు అన్నారు. శనివారం కర్నూలు జిల్లా దేవనకొండ మండలం ఎఫ్ ఆర్ యూపీ స్కూల్ లో గురుపూజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్లెకు పోదాం కార్యక్రమాలతోనే గ్రామాల్లో సమస్యలు పరిష్కారం



**పత్తికొండ సెప్టెంబర్ 06:–** గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం పల్లెకి పోదాం కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని పత్తికొండ ఆర్ డి ఓ భరత్ నాయక్ అన్నారు. శనివారం కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సచివాల సిబ్బంది సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా పత్తికొండ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను, అంగన్వాడి సెంటర్లు, హాస్టలన్ను ఆయన తనిఖీ నిర్వహించారు. గ్రామాల్లో దోమల బెడద ఉన్న ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించాలని పంచాయతీ అధికారులకు ఆదేశించారు. ఆయనతోపాటు డిప్యూటీ ఎంపీడీవో, ఈ.వో. నరసింహులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత బస్సు పథకంతో రోడ్డున పడ్డ ఆటో డ్రైవర్లు

**పత్తికొండ సెప్టెంబర్ 06:–** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం తీసుకురావడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని సిఐటియు మండల కార్యదర్శి యం. రవిచంద్ర అన్నారు. శనివారం పత్తికొండలో స్థానిక మారెళ్ళ ఆటో స్టాండ్ నుండి నాలుగు స్తంభాల కూడలిలో సిఐటియు ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకో కార్యక్రమానికి ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు పి. కాసిం అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి యం. రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పథకం తీసుకురావడం వల్ల మహిళలకు ఉపయోగమున్నా, ఆటో కార్మికుల ఉపాధి మాత్రం గల్లంతైందని అన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిందని, అధికారం వచ్చిన వెంటనే ఆ వాగ్దానాన్ని




మరిచారన్నారు. వెంటనే ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ పెన్షన్ బ్యాంకు రుణాలు అందించాలన్నారు. అలాగే ఆటో కార్మికుల కోసం ఆటో ఉన్న ప్రతి ఒక్కరికి 25 వేలు సంవత్సరానికి భృతి కల్పించాలని, సమగ్ర చట్టాన్ని రూపొందించి వాహన మిత్ర అమలు చేయాలన్నారు. అలాగే రవాణా చట్టం ద్వారా విపరీతమైన చలానాలను విధించకూడదు అన్నారు. ఏటీసీని ఎత్తివేసి ఆటో కార్మికులకు కాలనీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో. ఆటో కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు మురుగన్, శేఖర్, వ్యవసాయ సంఘం మండల కార్యదర్శి నరసన్న, డివైఎఫ్ఐ మండల నాయకులు డి.అల్లిపిర, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి మంజు, ఆటో కార్మిక సంఘం సభ్యులు మోహన్, వలి, చిట్టిబాబు, జగ్గు, రఘు, వినోద్, ఆచారి, రఘు, మునిస్వామి. తదితరులు పాల్గొన్నారు

# కడప నగర సౌత్ జోన్ విస్తృతస్థాయి సమావేశం

**● కడప నగరంలో సౌత్ జోన్ విస్తృత స్థాయి సమావేశం ● బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహణ**

**● కడప ఎమ్మెల్యే మాటలకే పరిమితం - అభివృద్ధిలో శూన్యం" ● అంజాద్ భాష, మేయర్ సురేష్ బాబులు విమర్శ**

**కడప సెప్టెంబర్ 06:–** కడప నగరం విస్తృతస్థాయి సమావేశం బాబు సురిటి మోసం గ్యారెంటీ కార్యక్రమం సౌత్ జోన్ అధ్యక్షులు ఐస్ క్రీమ్ రవి ఆధ్వర్యంలోకడప హరిత ఫంక్షన్ హాల్లో సౌత్ జోన్ విస్తృత స్థాయి సమావేశం "బాబు షూరిటీ మోసం గ్యారంటీ" కార్యక్రమం శనివారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ భాష, కడప నగర మేయర్ కే. సురేష్ బాబు, హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన అంజాద్ భాష మాట్లాడుతూ, "వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉద్యమాల పుట్టిన పార్టీ, పార్టీకి కార్యకర్తలే బలం. వారికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తాం. వాళ్ల సమస్యలు మా సమస్యలే," అని పేర్కొన్నారు. అలాగే, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి




నాయకత్వంలో రానున్న ప్రభుత్వం 2.0లో అందరికీ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఆయన మాట్లాడుతూ, "ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక సంవత్సరం పూర్తి చేసుకుంది. కానీ ఇప్పటివరకు ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేకపోయారు. ప్రజలకు మోసం జరిగింది. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఇబ్బందులు కలిగించడాన్ని సహించం," అని స్పష్టం చేశారు. శాసనసభ్యురాలుగా "గెలిచిన మరుసటి రోజే 10 కార్లలో రవీంద్రనగర్‌లో వెళ్లి షామీర్య, లా కాలేజ్ బ్రిడ్జిలు ఆరు నెలల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కానీ ఏడాది దాటుతున్నా ఒక్క ఇటుక కూడా కదలలేదు," అని అంజాద్ భాష ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన జీవోలు ప్రస్తుతం డేట్లు మార్చి, వాటిని కొత్త జీవోలు చూపిస్తున్నారు అని ఆరోపించారు. "జనానికి అభివృద్ధి కావాలి కానీ, శాసన సభ్యురాలు ప్రచారపోకడలతో కాలం గడుపుతున్నారు. ప్రజల ముందు ఆమె సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది," అని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ అధ్యక్షులు ఐస్క్రీం రవి, నార్త్ జోన్ ఇలియాస్ బిహెచ్, వెస్ట్ జోన్ అధ్యక్షులు నాగేంద్ర రెడ్డి, ఆర్టిఐ విభాగము అధ్యక్షుడు వెల్లాల రామకృష్ణారెడ్డి. జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, బంగారు నాగయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, జిల్లా యువజన అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు టిపి వెంకటసుబ్బమ్మ, జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడు గురు సాయి దత్త, నగర అనుబంధ అధ్యక్షులు కంచుపాటి బాబు, రాకింగ్ తస్వీర్, నందలూరు ఫయాజ్, చైతల్య, అశోక్ రెడ్డి, డాక్టర్ అజ్గర్ అలీ ఖాన్, నిశాంత్, కార్పొరేటర్లు చెన్నయ్య, అరిపుల్లా, జిలాన్, షఫీ, చాక్లెట్ గౌస్, అలీ అక్బర్, షంషీర్, మహమ్మద్ రఫీ, బసవరాజు, మక్బూల్, పీరు, కో ఆప్షన్ సభ్యురాలు మరియులు, మహిళా నాయకులు కృష్ణవేణి రెడ్డి, జ్యోతి, తులసమ్మ, ఉమామహేశ్వరి, రత్నకుమారి, మల్లేశ్వరి, శివమ్మ, పద్మ, నివేదిత, సుజిత, కమల్ బి తదితరులు ఉన్నారు.

# ఉల్లి కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించండి



**ఉల్లి రైతులకు సమాచార నిమిత్తం కంట్రోల్ రూమ్- 7095621491: జిల్లా కలెక్టరు డా.శ్రీధర్ చెరుకూరి**

**కడప సెప్టెంబర్ 06 :–** జిల్లాలో ఉల్లి పండించిన మరియు e-crop రైతుల నుండి ప్రభుత్వం ఉల్లి ఒక క్వింటాల్ 1200 /- ధర పై మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయు ప్రక్రియ సెప్టెంబర్ 4వ తేది నుండి జిల్లాలో ప్రారంభించడం జరిగిందని, ఈ కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు డా.శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టరు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో జరుగుతున్న ఉల్లి కొనుగోలు ప్రక్రియ పై జిల్లా జాయింట్ కలెక్టరు అదితి సింగ్, వ్యవసాయ, మార్క్ ఫెడ్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ..జిల్లాలో ఉల్లి పంట కొనుగోలు కొరకు 2 కొనుగోలు కేంద్రాలు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసి) కమలాపురం, మైదుకూరు నందు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ నెల 4 నుండి పంట కొనుగోలు ప్రక్రియ ప్రారంభించారని, ఈ ప్రక్రియ ను పకడ్బందీగా నిర్వహించి ఉల్లి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ ఉల్లిపంటను ఆరబెట్టి గ్రేడింగ్ మరియు శుభ్రం చేసుకొని యార్డుకు తీసుకొని వచ్చేలా, కేవలం e-crop నందు నమోదు చేసుకున్న రైతులు మాత్రమే తమ పట్టాదారు పాసు పుస్తకం మరియు ఆధార్ కార్డు తో పాటు రైతు సేవా కేంద్ర సిబ్బంది ఇచ్చు ఉల్లిపంట నమోదు సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు మార్కెట్ యార్డుకు వచ్చు సమయంలో తప్పనిసరిగా తీసికొని వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ అవకాశమును జిల్లాలో ఉల్లిపంట పండించిన ప్రతి రైతు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఉల్లి రైతులకు సమాచార నిమిత్తం కంట్రోల్ రూమ్–7095621491 ఎం.పరిమళ జ్యోతి, ఏపి మార్కెఫెడ్ జిల్లా అధికారి ను సంప్రదించవచ్చునని తెలిపారు.

# మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి' యాప్

**కడప రూరల్ సెప్టెంబర్ 06:–** జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా ఎస్పీ ఇ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, పాఠశాలలు మరియు కళాశాలల్లో 'శక్తి' యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. 'శక్తి' యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని 'శక్తి' టీమ్ మహిళా ఎస్.ఐ శాంతమ్మ తెలిపారు. ఈ యాప్ యొక్క ప్రాముఖ్యత మరియు దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై కడప నగరంలోని రిమ్స్ నర్సింగ్ విద్యార్థినుల వసతి గృహంలో శనివారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 'శక్తి' యాప్ ఎలా ఉపయోగించాలి? అత్యవసర, ప్రాణాపాయ పరిస్థితిలో చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చేవారికి, వారి కుటుంబ సభ్యులకు నర్సింగ్ విద్యను అభ్యసించిన మీరు ఇచ్చే మానసిక స్థైర్యం వారికి ఎంతో బలాన్నిస్తాయని మహిళా ఎస్.ఐ శాంతమ్మ తెలిపారు. అందువల్లే కేవలం నర్సుల కే 'లైటింగ్ ఆఫ్ ద లాంప్' అనే బిరుదు ఇవ్వదగినదని ఆమె అభిప్రాయపడ్డారు. ఆపదలో ప్రాణం పోసే వృత్తిలో ఉన్న మీ లాంటి వారికి ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నపుడు 'శక్తి' యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చున్నారు. కార్యక్రమంలో ఓ విద్యార్థినికి డెమో కాల్ ద్వారా ప్రాక్టికల్ గా వివరించారు. కేవలం 30 సెకన్లలోనే 'శక్తి' యాప్ కాల్ రావడం తో అందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా, ఎస్.ఐ. శాంతమ్మ నర్సింగ్ విద్య అభ్యసించే విద్యార్థినులకు మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను గుర్తు చేశారు:డయల్ 100/112 (అత్యవసర సహాయం) చైల్డ్ లైన్ 1098 (పిల్లల రక్షణ) గృహ హింస 181 మహిళ వేధింపులు 1091 సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930 సైబర్ మిత్రప్రతి మహిళ, బాలిక తమ భద్రత కోసం ప్రభుత్వ కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి, వారిని చైతన్యవంతులను చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ హాస్టల్ ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ వి. శివకుమారి, హాస్టల్ వార్డెన్ వి. సంధ్యారాణి, నర్సింగ్ విద్యార్థినులు , 'శక్తి' టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయం మూసివేత

**- ఈ.ఓ.నరసింహారెడ్డి**



**బొమ్మనహాల్ సెప్టెంబర్ 06:-** మండల పరిధిలోని.ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రం నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం.నేడు భాద్రపద పౌర్ణమి.ఆదివారం రాహు గ్రహస్థ సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆలయం మూసివేయడం జరుగుతుందని. ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి.తెలిపారు.గ్రహణం 7వ తేదీన రాత్రి 9:50 నిమిషాలకు ప్రారంభమై 8 వతేదీన సోమవారం తెల్లవారుజామున 3:41 నిమిషాలకు విడుస్తుందన్నారు.దీని కారణంగా నేడు మధ్యాహ్నం 12:30 మూసివేసి.మరుసటి రోజున 8న సోమవారం స్వామివారికి సుప్రభాత సేవ ఉదయం 6 గంటల నుండి స్వామివారి దర్శనం సౌకర్యం కల్పించడం జరుగుతుందని భక్తదులకు తెలియజేశారు.

## ఘనంగా హజరత్ మహమ్మద్ పీర్ మోహియుద్దీన్ ఉరుసు మహోత్సవం



**పత్తికొండ సెప్టెంబర్ 06:-** పత్తికొండ పట్టణంలోని చెరువు కట్ట వరిమలాల్లో వెలసినహజరత్ మహమ్మద్ పీర్ మోహియుద్దీన్ స్వామివారి ఉరుసు మహోత్సవ ం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉరుసు సందర్భంగా స్వామివారి చాదర్ ను ఊరేగించారు. దర్గాలో చాదర్ సమర్పణ అనంతరం పాతేహాలు నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు.

## నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్న రామగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి



**పులివెందుల టౌన్ సెప్టెంబర్ 06:-** పట్టణంలోని శ్రీకర్ కళ్యాణ్ మండపంలో జరిగిన నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరై బూచుపల్లి దీక్షిత, పోలు సతీష్ రెడ్డి ల ను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి నిశ్చితార్థ కార్యక్రమంలో హాజరై కొత్త జంటను ఆశీర్వదించడం జరిగింది జీవితం మంచి గడపాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమానికి పాల్గొన్న సందర్భంలో ఉమాదేవి కలవడం జరిగింది

## కులమత పార్టీలకు అతీతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం

**- తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వి.బి.రాజేంద్ర ప్రసాద్**



**ఉయ్యూరు సెప్టెంబర్ 06: -**ఉయ్యూరులోని 17వ,వార్డు చింతల తోట ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలలో భాగంగా ఈ రోజు నిమజ్జన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్ పాల్గొని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కుల మత పార్టీలకు అతీతంగా వినాయక ఉత్సవాలు నిర్వహించడం వలన భక్తి భావం సోదరభావం పెరుగుతుందన్నారు, అదేవిధంగా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని వినాయక మండపాల ఉచిత విద్యుత్తును ఇచ్చింద న్నారు, ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన చింతలతోట ఫ్రెండ్ సర్కిల్ సభ్యులను అభినందించారు. జంపాన పూర్ణ చంద్రరావు, వెనీగళ్ళ కుటుంబరావు, రాజులపాటి రామచంద్రరావు, రాజుల పాటి ఫణి,చిన్ని,వెంకట్, నాగరాజు, నరసింహారావు, తేజ, జంపాన శివయ్య,శంకర్, శివ, జంగమయ్య, వివిధ పార్టీల నాయకులు,చింతల తోట ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన తహాశీల్దార్.ఎంపిడిఓ.ఎంఈఓ



**బొమ్మనహాల్ సెప్టెంబర్ 06:-**మండల పరిధిలోని.స్థానిక మండల విద్యాశాఖధికారి. కార్యాలయంలో. ఎంఈఓ మల్లికార్జున.వీరన్న. ఆధ్వర్యంలో. ఉత్తమ. ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు .మండల తహాశీల్దార్ మునివేలు.ఎంపిడివో విజయభాస్కర్. ఎంఈఓ. మల్లిఖార్జున. ఈఓఆర్డి.దాస్.వారు కలసి. మొదటగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పించారు,అనంతరం సభను ఉద్దేశించి.తహాశీల్దార్ మునివేలు మాట్లాడుతూ.సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని నిన్నటి రోజున గురుపూజోత్సవం. నిర్వహించుకోవడం.ఉత్తమ సేవలు అందుకున్న గురువులను సత్కరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.సమాజంలో మంచి చెడుల తేడాలను ప్రతి ఒక్కరికీ తెలియజేస్తూ.సమ సమాజ స్థాపనకు.గొప్ప విద్యావంతులను తయారు చేస్తున్న గొప్ప శక్తి గురువులే అని కొనియాడారు. అనంతరం ఉత్తమ సేవలు అందుకున్న ఉపాధ్యాయులుగా. ఎంపీపీఎస్.బొమ్మనహాల్ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు. సాయిలీల.ఎంపీపీఎస్.ఉప్పరహాల్ ప్రధానోపాధ్యాయురాలు. వాణిశ్రీ,జడ్పీహెచ్ఎస్.గొనేహాల్ హిందీ ఉపాధ్యాయులు.కాళిదాసు రాజు, జెడ్పిహెచ్ఎస్.ఉద్దేహాల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు.పవన్.ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నిక కావడం చాలా సంతోషఖారం అని.ఎంఈఓ మల్లికార్జున.వీరన్న. కొనియాడారు. అనంతరం.ఉత్తమ. ఉపాధ్యాయులకు మెమెంటోలను,ప్రశంసా పత్రాలను అందజేస్తూ పూలమాల వేసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయు సంఘాల బాధ్యులు.ఆంజనేయులు దేవ శిఖామణి.సూరీడు.శరణప్ప. రాఘవేంద్ర. నవీన్.వన్నూరుస్వామి. ఎంఈఓ కార్యాలయ సిబ్బంది మంజప్ప.అమరేష్.ఇస్మాయిల్. రామాంజనేయులు.భాస్కర్.తదితర ఉపాద్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా వైకాపా నాయకుడు వేల్పుల రాము 49వ జన్మదిన వేడుకలు

**వేములలో ముస్లిం విద్యార్థులకు నోట్ బుక్స్ పంచిన ముస్లిం వైకాపా నేతలు**




**వేముల సెప్టెంబర్ 06:-**వేముల మండల పరిశీలముడు లింగాల రామలింగారెడ్డి (వేల్పుల రాము) 49వ జన్మదిన వేడుకలను వేముల మండల కేంద్రంలోని స్థానిక వేముల మక్కా మసీదు (పాత మసీదు) లో శనివారం సాయంత్రం గ్రామ ముస్లిం వైకాపా నేతలు ఘనంగా నిర్వహించారు.అందులో భాగంగా వారు భారీ కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి వేల్పల రాముకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి,ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించరు.అనంతరం మక్తబ్ పుస్తక పఠనం చదువుతున్న ముస్లిం విద్యార్థులకు అవసరం అయిన సురా బుక్,ఉర్దూ కాఫీ రైటింగ్,పెన్,పెన్సిల్,షర్పనేర్,పర్స్,టోపీ,తజ్వి తో పాటు మరి కొన్ని వస్తువులను పంపిణీ చేయగా విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు మునీర్,దౌలత్,మహబూబ్ వల్లీ,మదర్ షావలి,గౌస్పీర్,బాబవ్వలి,లతీఫ్,మాలిక్,సాహిల్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం కొత్త బాట: విక్రమాదిత్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్



**గాలివీడు సెప్టెంబర్ 06:-** పేద విద్యార్థుల విద్యాభవిష్యత్తు కోసం విక్రమాదిత్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. ట్రస్ట్ ముఖ్య ఉద్దేశాలు: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్పాన్సర్స్ సహకారంతో స్కాలర్షిప్స్ అందించడం. పేద విద్యార్థులకు నార్మల్ ఫీజుతో ట్యూషన్లు ఏర్పాటు చేయడం. ప్రతిభ కలిగిన 3, 4, 5వ తరగతి విద్యార్థులకు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నవోదయ కోచింగ్ అందించడం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మండల వైసీపీ నాయకులు మిట్టపల్లి ఎదుభూషన్ రెడ్డి, (ఎం ఈ ఓ) మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్, పి నాగరాజు, (ఎం పీ డీ ఓ) మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్, చంద్రమౌళి, మాట్లాడుతూ“పేద విద్యార్థుల చదువు కోసం ట్రస్ట్ చేస్తున్న ఈ ప్రయత్నం ప్రశంసనీయమైనది. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఉపయోగపడాలని ట్రస్ట్ వ్యవస్థాపకులు చలపతిని ప్రోత్సహించారు. మా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది” అని పేర్కొన్నారు...

## నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో 5000 వేల మందికి అన్నదానం



**తాడేపల్లి సెప్టెంబర్ 06:-** రాష్ట్ర ఐటీ ,ఎలక్ట్రానిక్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో తాడేపల్లి బైపాస్ రోడ్డులోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ,హంస అవార్డు గ్రహీత కళారత్న కళాపోషకలు కోమటి జయరాం,మంగళగిరిని యోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ సారధ్యంలో టిడిపి తాడేపల్లి పట్టణ వల్లభనేని వెంకట్రావు,గొర్ల వేణుగోపాల్ రెడ్డి( 7) టిడిపి ప్రాతూరు గ్రామ పార్టీ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 5000 వేల మంది కి అన్నదానం నిర్వహించారు.ముందు గా గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొండే పాటి కోటేశ్వరరావు, కోగంటి ప్రసాదు,కోగంటి వెంకటేశ్వరరావు, మొవ్వా నారాయణ, వెనిగండ్ల వేంకటేశ్వరరావు, పొగర్తి నాగేశ్వరరావు,వేమూరి రవి, ప్రభంజన, వేమూరి వీర రాఘవ య్య,మండవ గోపాలరావు, కొడాలి సత్య నారాయణ, దానబోయిన సుందరరావు యాదవ్,ఇట్టా భాస్కర్,తదితరులు పాల్గొన్నారు.

## సుఫలా ఫర్టిలైజర్ దుకాణంలో రెవెన్యూ, వ్యవసాయ అధికారుల తనిఖీ



**యాడికి సెప్టెంబర్ 06:-** యాడికి మండలంలో సుఫలా ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణంలో రెవెన్యూ మరియు వ్యవసాయ అధికారులు తనిఖీలు చేయడం జరిగినది. తనిఖీల్లో భాగంగా యూరియా ఎప్పుడు ఎక్కడ నుండి వచ్చినది ఏ రైతులకు ఇచ్చినది ఎంత ధరకు అమ్ముతున్నారో రికార్డులను పరిశీలించడం జరిగినది. సుఫల ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణంలో 290 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నదని, అలాగే మండలంలోని ఎరువుల దుకాణాలలో అవసరం మేరకు యూరియా ఉన్నదని రైతులెవ్వరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేయడం జరిగింది ఏదైనా డీలర్ యూరియాను అధిక ధరకు అమ్మిన, స్టాకు పెట్టుకొని లేదని చెప్పిన అట్టి డీలర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.రైతులు తప్పనిసరిగా ఎరువులు కొన్న తర్వాత రసీదును తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, డిప్యూటీ తాహశీల్దారు శ్రీనివాసులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణప్ప, గ్రామ రెవెన్యూ అధికారి దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

## లింగ వివక్షత.బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారిని. రమాదేవి



**బొమ్మనహాల్ సెప్టెంబర్ 06:-**మండల పరిధిలోని దర్గాహొన్నూరు గ్రామ.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలతో. రాష్ట్ర ప్రభుత్వం మరియు ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆదేశాల మేరకు కనేకల్ ప్రాజెక్టు సిడిపిఓ.నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించిన. లింగ వివక్షత బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా అధికారినీ రమాదేవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.పాఠశాల విద్యార్థులకు.మరియు తల్లిదండ్రులకు.లింగ వివక్షత. ఆరోగ్యం పని ప్రదేశంలో భద్రత. ఉన్నత విద్య.వృత్తి నైపుణ్యం. మహిళా సాధికార బాలిక ఆరోగ్యం పోషణ లోపం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అదేవిధంగా ప్రతి గ్రామంలోనూ ఆరోగ్యం సాధికారతపై సంక్షేమ పేరిట పలు అంశాలపై దేశవ్యాప్తంగా పది రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఈ సెప్టెంబర్ నెల 12వ తేదీ వరకు తప్పకుండా నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సిబ్బందికి తెలియజేశారు.మరి ముఖ్యంగా విద్యార్థినీలు పోక్సో చట్టం.గురించి అవగాహన కల్పిస్తూ పిల్లలకు లైంగిక నేరాల నుండి రక్షించడానికి రూపొందించిన ప్రత్యేక చట్టం గురించి ఈ యొక్క సమావేశంలో విద్యార్థినీలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ తిరుమల బాయ్. ఏఎన్ఎం మల్లమ్మ.అంగన్వాడి టీచర్లు.అంగన్వాడి ఆయాలు.ఆశ వర్కర్లు విద్యార్థినిలు.పాల్గొన్నారు.

## పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి

- **పరిపాలన అధికారి కె. విజయ కుమార్**
- **అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ 08562-246344**



**కడప సెప్టెంబర్ 06:-** ఈ నెల 07వ తేదీన జరిగే A.P.. ఫారెస్ట్ సబ్ ఆర్డినేట్ సర్వీసెస్ సంబంధించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్క్రీనింగ్ పరిక్షల నిర్వహణ పై సంబందిత అధికారులతో సమావేశం జిల్లాలోని 17 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న A.P.. ఫారెస్ట్ సబ్ ఆర్డినేట్ సర్వీసెస్ సంబంధించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్క్రీనింగ్ పరిక్షలను పకడ్బందీగా నిర్వహించాలని పరిపాలన అధికారి కె. విజయ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివరం కలెక్టరేట్ పి.జి.ఆర్.యస్ హాల్ లో.. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే A.P.. ఫారెస్ట్ సబ్ ఆర్డినేట్ సర్వీసెస్ సంబంధించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్క్రీనింగ్ పరిక్షల నిర్వహణ పై... పరిపాలన అధికారి కె. విజయ కుమార్ ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు శ్రీమతి యం. అమ్మాజీ, ఎ.యం. మాధవిలతా, సి హెచ్ దీప్తి, సెక్షన్ ఆఫీసర్స్ తో కలిసి పరీక్షల విధులు కేటాయించిన 17 మంది లైజెన్ ఆఫీసర్లు, 17 మంది చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపాలన అధికారి కె. విజయ కుమార్ మాట్లాడుతూ.. ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో A.P.. ఫారెస్ట్ సబ్ ఆర్డినేట్ సర్వీసెస్ సంబంధించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం.. ఈ నెల 07వ తేదిన ఉదయం 10.00 గంటల నుంచి 12.30 గంటల వరకు మరియు మద్యానం 03.00 గంటల నుంచి 05.30 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షను పటిష్టంగా, పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు ఉదయం 08.30 గంటల నుండి 09.45 గంటల వరకు మరియు 01.30 గంటల నుండి 02.45 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలి అని సూచించారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరువైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు.పోలీసు శాఖ ప్రతి సెంటర్లో బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు, వారి వెంట వచ్చే వారికి ఎలాంటి కొరత లేకుండా ఆయా పరీక్ష కేంద్రాల యాజమాన్యాలు అన్ని వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని కడప నగర పరిధిలో 09, చింతకొమ్మదిన్నె మండల పరిధిలో 04, ప్రొద్దుటూరు మండల పరిదిలో 04 పరీక్షా కేంద్రలతో కలిపి మొత్తం 17 కేంద్రాలను ఎంపిక చేయడం జరిగిందని తెలిపియున్నారు.అభ్యర్థుల సహాయార్థంహెల్ప్ డెస్క్ 08562-246344 కలెక్టర్ కార్యాలయము నందు A.P. ఫారెస్ట్ సబ్ ఆర్డినేట్ సర్వీసెస్ సంబంధించి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ మరియు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్క్రీనింగ్ పరిక్షలకు సంబంధించి హెల్ప్ డెస్క్ 08562-246344 గల నంబరు 05.09.2025 నుండి 07.09.2025 వరకు కార్యాలయ సమయం ప్రకారం పరీక్షాకు హాజరగు అభ్యర్థుల సహాయార్థం ఏర్పాటుజేయడమైనదిగా తెలిపియున్నారు.ఈ కార్యక్రమంలో పరిపాల అధికారి, ఏపీపీఎస్సీ సిబ్బంది, లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు మరియు లైన్ డిపార్టుమెంట్లు(లేబర్,పోలీస్,మెడికల్,ఎపియస్ ఆర్.టి.సి, ఎపియస్ పి.డి.సి.యల్)శాఖల సంబందిత అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
# తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం

ఆదివారం,
07 సెప్టెంబర్ 2025



# ముఖ్యమంత్రి దళితులకు, బలహీన వర్గాలకు క్షమాపణలు చెప్పిన తరువాత జిల్లాకు రండి

● రాష్టంలో ఎస్సీ, బీసీ ప్రజాప్రతినిధులు మాత్రమే అవినీతికి పాల్పడుతున్నారా? ● రాష్ట్రములో 175 నియోజకవర్గాలలోను టూ మెన్ కమీటీ ల సభ్యులు ఉన్నారా? లేదు ఒక శింగనమల నియోజకవర్గం లోనే నా? ● అవినీతి ఒక శింగనమల లోనే నా, కుప్పం లో లేదా? మంగళగిరి లో లేదా? పులివెందులలో లేదా? ● వీటికి బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి ● డా. పోతుల నాగరాజు డిమాండ్.




**అనంతపురం సెప్టెంబర్ 06:-** అవినీతి రాజకీయాల గురించి కేవలం రాష్ట్రము లో ఒక శింగనమల నియోజకవర్గం లోనే జరుగుతుంది అనే ఒక బ్యాడ్ ప్రచారంను ఒక దళిత ఆడబిడ్డ ఎమ్మెల్యే గా ప్రాతినిధ్యం వహిస్తున్న చోట ఇద్దరు అగ్రకులాల వ్యక్తులను టూ మెన్ కమీటి పేరుతో మీరు మీ పార్టీ నాయకులు తయారు చేసిన వ్యవస్థ లో వారు చేస్తున్న తప్పుడు ప్రచారంకు ఒక ఆడబిడ్డ ను బలి చేస్తారా? ఇదేనా మీ నీతి, ఇదేనా మీరు దళిత మహిళలకు ఇచ్చే గౌరవం, ఇక్కడ మాత్రమే అవినీతి జరుగుతుందా? మిగతా 174 నియోజకవర్గం ఎమ్మెల్యే లు నీతి వంతులని మీరు భావిస్తున్నారా? లేదా అనంతపురం ఎంపీ మాత్రమే అవినీతి చేస్తున్నారు, మిగతా 24 మంది పార్లమెంట్ సభ్యులు నిజాయితీ పరులు అని మీరు భావిస్తున్నారా? లేదు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న ఎమ్మెల్యే లు మంత్రులు, ఎమ్మెల్సీ లు ఎలాంటి అవినీతి చేయడం లేదు, ఒక శింగనమల ఎమ్మెల్యే, అనంతపురం ఎంపీ లు మాత్రమే అవినీతి చేస్తున్నట్లు పత్రిక లలోను, మీ చెప్పు చేతల్లో ఉన్న మీడియా లోను ఒక కుట్ర పూరిత ప్రకటనలు కొద్ది మంది వ్యక్తులు చేయిస్తూ ఉన్న రాజకీయ కుట్ర లో దళిత, బలహీన వర్గంకు చెందిన ప్రజాప్రతినిధులు బలి కావాలా?నిజంగా మీరు అవినీతిని ప్రక్షాళన చేయాలి అనే చిత్త శుద్ధి మీకు ఉంటే, ఒక్క అనంతపురం ఉమ్మడి జిల్లా లో మీ పార్టీ ప్రజాప్రతినిధులు మద్యం వ్యాపారం లో, అధికారులు పోస్ట్ ల విషయంలో, ఇసుక మాఫియా లో, గ్రానెట్ అక్రమ వ్యాపారం లో, ప్రభుత్వం భూముల అక్రమంగా ఆక్రమించడములో, పరిశ్రమల యాజమాన్యం తో వసూలు, లే అవుట్ లలో వసూళ్లు, కొత్త నిర్మాణం అనుమతులలో వసూళ్లు, ఇలా చెప్పుకుంటూ పోతే అవినీతి చేయని, అవినీతి కి పాల్పడని ప్రజాప్రతినిధులు మీ పార్టీ ఎంత మంది ఉన్నారో సమాధానం చెప్పండి.ఇక్కడ కేవలం తమ ఆధిపత్యం కోసం పార్టీ పరువు ను తీస్తున్నారు, దళిత ఆడబిడ్డ ను అవమానాలకు గురి చేస్తున్నారు ఇలాంటి వారికీ ఎందుకు ఇంత బాధ్యత మీరు ఇచ్చారు? రాష్ట్రము లో ఏ నియోజకవర్గం లోను లేని సంప్రదాయం ఇక్కడ అమలు చేస్తున్నావ్. ఇదేనా మీకు దళిత ప్రజాప్రతినిధుల మీద ఉన్న గౌరవం, ఇదేనా ఒక ఆడబిడ్డ మీద ఉన్న గౌరవం సమాధానం చెప్పాలని, అక్కడ ఉన్న టూ మెన్ కమీటి ని వెంటనే రద్దు చేయాలని, అక్కడ నియోజకవర్గం లో పూర్తి స్వేక్ష ను ఎమ్మెల్యే కి అప్పగించాలని, రిజర్వేషన్ల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు డా. పోతుల నాగరాజు, ముఖ్యమంత్రి ని డిమాండ్ చేస్తున్నారు.

# జిల్లాను నెంబర్ వన్ స్థాయికి తీసుకురావాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**ఘనంగా "సంపూర్ణత అభియాన్ సత్కార కార్యక్రమం**



**కడప సెప్టెంబర్ 06:-** ఏడేళ్లలో జరిగిన అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకుని.. మరో ఏడాదిలో వైఎస్ఆర్ కడప జిల్లాను జాతీయ స్థాయిలో నెంబర్ వన్ స్థాయికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులకు సూచించారు.ఆకాంక్ష జిల్లా, ఆకాంక్ష బ్లాకుల్లో ఆరు విభాగాల్లో లక్ష్యాలను సాధించిన నేపథ్యంలో.. సంబంధిత భాగస్వామ్య శాఖల అధికారులు, ఫ్రెంట్ లైన్ అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ.. శనివారం కడప మాధవి కన్వెన్షన్ హాలులో "సంపూర్ణత అభియాన్ సత్కార కార్యక్రమం" ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తోపాటు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా.. ఆకాంక్ష జిల్లా, బ్లాకుల లక్ష్య సాధనకు చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి ఆయా శాఖలు ప్రదర్శించిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటైన సభలో.. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లు ఎడిపి భాగస్వామ్య శాఖల అధికారులు, ఫ్రెంట్ లైన్ అధికారులు, సిబ్బందికి పథకాలను, ప్రశంసా పత్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వైఎస్ఆర్ కడప ఆకాంక్ష జిల్లాలో ఎంపిక కాబడిన చింతకొమ్మదిన్నె, జమ్మలమడుగు ఆకాంక్ష బ్లాక్ లలో నీతీ ఆయోగ్ గుర్తించిన 6 అంశాల్లో "సంపూర్ణత అభియాన్" కార్యక్రమాన్ని సంభందిత శాఖలైన వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, విద్య, నైపుణ్యాభివృద్ధి, వ్యసాయ, పట్టణాభివృద్ధి మొదలైన శాఖల ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వము గుర్తించిన ఆరు ముఖ్యమైన ఇండికేటర్స్ (జీవన ప్రమాణాలు మెరుగు పరచుటలో) సంబంధించి సంతృప్తికర స్థాయిని పొందడమే సంపూర్ణత అభియాన్ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అయితే ఫిబ్రవరి 2024 నాటికి ఆకాంక్ష జిల్లా, బ్లాకుల్లో వైద్య ఆరోగ్య రంగంలో ప్రెగ్నన్ట్ ఉమెన్ సమస్యలను, ఐసిడిఎస్ లో బాలింత తల్లుల పోషకాహర సమస్యలు, విద్య శాఖలో ఎడ్యుకేషన్ లో మౌలిక సదుపాయలు, వ్యవసాయంలో సాయిల్ హెల్త్ కార్డులు పంపిణి, గ్రామీణాభివృద్ధి రంగాలలో %బాం+బా% గ్రూపులకు బ్యాంకు రుణాలు అందజేయడం.. వంటి ఆరు అంశాల్లో జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకుని వచ్చే సంపూర్ణత అభియాన్ అభివృద్ధి లక్ష్యాన్ని 100% సంతృప్తికర స్థాయిలో సాధించినందులకు గాను నీతి ఆయోగ్ మన జిల్లాకు మొదటి ర్యాంకును ప్రకటించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు అభివృద్ధి సాధనకు చిహ్నంగా హస్త ముద్రికలను అద్దాడంతో పాటు.. జిల్లాకు హాష్ ట్యాగ్ కొటేషన్లను కూడా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమములో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి హజరతయ్య, డిఎహెచ్ఓ డా. శ్రీ నాగరాజు, ఐసిడిఎస్ పిడి రమాదేవి, డీఈవో శంశుద్దిన్, డిఎవో చంద్రా నాయక్, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, ఎల్డిఎం జనార్దనం, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, నీతి ఆయోగ్ యంగ్ ప్రొఫెషనల్స్ తదితరులు పాల్గొన్నారు.

# మండలాల స్మార్ట్ కిచెన్ పనులు వేగవంతంగా పూర్తి చేయండి

● జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
● పి4 భాగస్వామ్యంతో స్మార్ట్ కిచెన్ మెటీరియల్



**కడప సెప్టెంబర్ 06:-** మండలాల స్మార్ట్ కిచెన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోనీ మండలాల్లో స్మార్ట్ కిచెన్ ల నిర్మాణాల అంచనాలు,టెండర్లు, మెటీరియల్ సంబంధిత అంశాలపై వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ద్వారా నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే కడప, సి కె దీన్నే, జమ్మలమడుగు మూడు మండలాల్లో స్మార్ట్ కిచెన్ లను విజయవంతంగా ప్రారంభించి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందచేస్తున్నామని తెలిపారు. మిగిలిన 33 మండలాలలో వివిధ స్కూళ్లలో స్మార్ట్ కిచెన్ల నిర్మాణాలకు సంబంధించి టెండర్లు పిలిచి రానున్న మూడు నెలల్లో పూర్తి చేసే విధంగా అధికారులు ప్లాన్ అఫ్ యాక్షన్ తయారు చేయాలని ఆదేశించారు. ప్రతి స్మార్ట్ కిచెన్ 1200 చదరపు అడుగులలో నిర్మాణాలు చేపట్టాలన్నారు అలాగే స్మార్ట్ కిచెన్ కు సంబంధించిన మెటీరియల్ ఆయా మండలాలలో విజయవంతమైన వ్యక్తులను గుర్తించి పి 4 భాగస్వామ్యంతో అందించే విధంగా కృషి చేయాలన్నారు. బద్వేల్ నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో ఇప్పటికే పి4 భాగస్వామ్లను గుర్తించామని అదేవిధంగా మిగిలిన మండలాలు త్వరితగతన గుర్తించాలన్నారు.స్మార్ట్ కిచెన్ లకు అవసరమైన ప్రకృతి వ్యవసాయ కూరగాయలు, ఆకుకూరలు అందజేయడానికి స్వయం సహాయక గ్రూపులను భాగస్వామ్యం చేయాలన్నారు. అలాగే స్మార్ట్ కిచెన్ పరిధిలోని పాఠశాలలకు ఆహార పదార్థాలను సరఫరా చేయడానికి ఏజెన్సీల ద్వారా వాహనాలను గుర్తించాలన్నారు. ప్రతి స్మార్ట్ కిచెన్ కు కిచెన్ మేనేజర్ నియమించాలని అధికారులను ఆదేశించారు. ఆగ్రోస్ డిఎం జోయల్ విజయ్ కుమార్,డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డిఇఓ శంషుద్దీన్, డ్వామా పిడి ఆదిశేషారెడ్డి, సీపీఓ హజరతయ్య, పంచాయతీ రాజ్ ఎస్ ఈ మద్దన్న, అధికారులు పాల్గొన్నారు.

# రాపిడో రైడర్స్ సైబర్ నేరగాళ్ల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలి

● సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ఎ. మధు మల్లేశ్వర రెడ్డి




**కడప రూరల్ సెప్టెంబర్ 06:-**రాపిడో రైడర్స్(కెప్టెన్స్) ను సైబర్ మోసగాళ్లు మోసం చేసే విధానం పై సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో పాత బస్సు స్టాండ్ వద్ద అవగాహన కార్యక్రమం..రాపిడో రైడర్స్ ఇటీవల కాలంలో పలువురు సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసపోయినట్లు పోలీస్ శాఖ దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మరొకరు మోసపోకుండాసైబర్ మోసగాళ్లు మోసం చేసే విధానం పై జిల్లా ఎస్పీ ఇ జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ మధు మల్లేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కడప నగరంలోని పాత బస్ స్టాండ్ వద్ద రాపిడో రైడర్స్ కు అవగాహన కల్పించారు. అనంతరం సంబంధిత పోస్టర్లను రద్దీ ప్రదేశాల్లో గోడలకు అతికించారు. ఇన్స్పెక్టర్ మాటల్లో సైబర్ నేరగాళ్ళు జరిపే సంభాషణ ఇలా...కస్టమర్: బ్రదర్, నేను రాపిడో బుక్ చేశాను. నాకు మెడికల్ ఎమర్జెన్సీ ఉంది. మీరు మందులు తీసుకుని రావాలి. దగ్గర్లోనే హాస్పిటల్ ఉంది. అక్కడికి వెళ్లండి, మందులు ఇస్తారు. మీరు డబ్బులు చెల్లించండి. నేను మీకు ఫోన్ పే చేస్తాను లేదంటే మీరు వచ్చిన తర్వాత క్యాష్ ఇస్తాను అని అంటారు.తర్వాత Rapido Rider: నాదగ్గర డబ్బులు లేవు సార్, మీరు డబ్బులు ఇస్తే నేను తీసుకురాగలను అని అంటాడు.అప్పుడు ఆ మోసగాడు నేను నీకు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపాను మీ నెంబర్ కి మెసేజ్ వచ్చింది చూసుకోండి అని చెప్తాడు. కానీ అతను మొబైల్ నెంబర్ నుండి అమౌంట్ పంపినట్లు మెసేజ్ పంపిస్తాడు కానీ rapido అతను డబ్బులు పంపినట్లు మెసేజ్ వచ్చినది అని వాళ్ళు పంపిన స్కానర్ కి డబ్బులు పంపుతాడు. తర్వాత చూసుకుంటే డబ్బులు పంపలేదని తెలుసుకుంటాడు. తర్వాత ఆ నెంబర్ కి ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుంది. అంతట అతను మోసపోయాను అని తెలుసుకొని సైబర్ క్రైమ్ దగ్గరకి వచ్చి కంప్లైంట్ ఇస్తాడు.ఈ విధమైన ట్రిక్కుల వల్ల, రాపిడో సిబ్బంది తమ కష్టంతో సంపాదించిన డబ్బులు కోల్పోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.ఎవరూ కూడా ఇలా మోసపోకూడదని, జిల్లా ఎస్. పి ఇ.జి.అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందరికీ అవగాహన పెంపొందించేందుకు కార్యక్రమం చేపట్టడం జరిగిందని సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ తెలిపారు.సూచనలు: ఎవ్వరైనా ముందుగా డబ్బులు అడిగితే లేదా స్కానర్ ద్వారా డబ్బులు పంపమంటే నమ్మకండి.అధికారిక యాప్ లేదా సురక్షిత మార్గాల్లో మాత్రమే లావాదేవీలు చేయండి.అనుమనాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు తెలియజేయండి.ఈ విధమైన అవగాహన కార్యక్రమాలు మిమ్మల్ని, మీ డబ్బును కాపాడుతాయని ఎప్పటికీ గుర్తుంచుకోండి.

# జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు



**కడప సెప్టెంబర్ 06:-** కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, ఆదేశాలు, జిల్లా ఎస్పీ ఇ.జి. అశోక్ కుమార్ ఉత్తర్వుల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాలు జరిగాయి.పోలీస్ అధికారులు మాట్లాడుతూ, రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వాహనదారులకు **పలు ముఖ్యమైన సూచనలు చేశారు:మైనర్ల డ్రైవింగ్:** మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, అలా చేస్తే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. **హెల్మెట్ తప్పనిసరి:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడుతుందని వివరించారు. **ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్ వద్దు:** వేగంగా, అతిగా లోడ్ చేసి వాహనాలు నడప డం ప్రమాదకరమని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. **డ్రంకెన్ డ్రైవ్:** మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, డ్రంకెన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రోడ్డు భద్రతపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేయాలని పోలీసులు కోరారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య**



**పులివెందుల సెప్టెంబర్ 06:-**పులివెందుల అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొగ్గుడుపల్లె లో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించడమైనది.ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ వర్షాలు పడుతున్నయి కాబట్టి ప్రజలు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి అని, తోట్లు, నీటి డ్రమ్ములు, నీరు నిల్వ ఉంచుకొనే ఇతర పాత్రలపైన మూతలు ఉంచాలి అని, ఒక దోమ ఒక్కసారికి వంద నుండి రెండు వందల వరకు గుడ్లు పెట్టును కావున దోమను లార్వా దశలోనే అంతం చెయ్యాలి అని .దోమ గుడ్లు సాధారణంగా నీటి ఉపరితలంపై పెడతాయి.దోమ యొక్క జీవన చక్రం నాలుగు దశల్లో జరుగుతుంది.గుడ్డు దశ: నీటిలో పెడతాయి, 2-3 రోజుల్లో లార్వా అవుతాయి. లార్వా దశ : నీటిలో జీవిస్తుంది, 7-10 రోజులు ఉంటుంది. ప్యూపా దశ: 2-3 రోజులు ఉంటుంది, తర్వాత పెద్ద దోమగా మారుతుంది.పెద్ద దోమ దశ: నీటినుంచి బయటకు వచ్చి ఎగరడం మొదలు పెడుతుంది. దోమల ద్వారా వచ్చే ప్రధాన వ్యాధులు,ఏడిస్ దోమ ద్వారా డెంగ్యూ, చికున్‌గునియా, అనోఫిలిస్ దోమ ద్వారా మలేరియా,క్యులెక్స్ దోమ ద్వారా ఫైలేరియాసిస్, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ మొదలగు వ్యాదులు వస్తాయి అని సిద్దయ్య అన్నారు. ఆరోగ్య కార్యకర్తలు సోమలింగారెడ్డి, లక్ష్మీదేవి ఆశా కార్యకర్త సావిత్రి పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ నగర్ రోడ్డులో ఆక్రమణలు తొలగించండి: కమిషనర్ ఎన్.మౌర్య

**తిరుపతి సెప్టెంబర్ 06:-**నగరంలోని ఉపాధ్యాయ నగర్ రోడ్డులో రాకపోకలకు అడ్డంగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా వచ్చిన వినతులను శనివారం అధికారులతో కలసి ఉపాధ్యాయ నగర్, మానస సరోవర్ మార్గంను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ నగర్ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఆక్రమణలు ఉన్నాయని పిర్యాదులు వచ్చాయని అన్నారు. ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే ఉపాధ్యాయ నగర్ లో సీసీ రోడ్లు లేని ప్రాంతాల్లో రోడ్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న ప్లాట్లలో చెత్తా చెదారం తొలగించి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మూర్తి, డి.ఈ శిల్ప, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

# ట్రంప్‌కు పట్టిన దెయ్యం దిగివచ్చేలా చేయాలి !



ఎవరు తవ్వుకున్న గోతిలో వారే పడతారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఇది బాగా సరిపోతుంది. టారిఫ్‌లు పెంచి ప్రపంచాన్ని లొంగదీసుకుందామనుకున్న ట్రంప్‌కు అనూహ్యంగా ఎదురుదెబ్బలు తాకుతున్నాయి. ఎంతగా అంటే అమెరికాను ధిక్కరించేంతగా. తొలుత చైనా గట్టిగానే ఎదిరించింది. ఇప్పుడు భారత్ కూడా మాట్లాడకుండా చెవి మెలిపెట్టింది. నీ లెక్కేంత అన్న తీరులో భారత్ చర్యలు ఉంటున్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలును అడ్డం పెట్టుకుని టారిఫ్‌లు విధించడం ద్వారా ఇప్పుడు అమెరికా ఏకాకి అయ్యింది. షాంఘై సదస్సు తరవాత ట్రంప్‌లో అసహనం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. భారత్, చైనా,రష్యాలు ఏకమయ్యాయని, భారత్‌ను దూరం చేసుకున్నానని వలపోస్తున్నాడు. ఆ వలపోత ఏదో ముందే ఉండాలి. బెదరించి టారిఫ్‌లు విధిస్తే భారత్ లొంగుతుందని అనుకున్నాడు. అందుకే భారత్ మాట్లాడకుండా సమాధానం ఇస్తోంది. రష్యానుంచి బరాబర్ ఆయిల్ కొనుగోలు చేస్తామని తేల్చింది. కేంద్రమంత్రులు హర్దీప్ సింగ్, నిర్మలా సీతరామన్‌లు కూడా రష్యా చమురు కొనుగోళ్లను సమర్థించారు. అలాగే అమెరికా బెదిరింపు లకు తలొగ్గేది లేదని తేల్చారు. ఈ క్రమంలో ట్రంప్ నిర్వేదంలో ఉన్నాడు. తాను అనుకున్న దానికన్నా భారత్ భిన్నంగా ఉందన్న విషయం ఇప్పుడిప్పుడే అవగతం అవుతోంది. నిజానికి భారత్ తలచుకుంటే అమెరికా దెబ్బతినడం ఖాయం. అక్కడ ఉన్న టెక్కీలు భారత్‌కు తిరిగివస్తే నష్టపోయేది అమెరికాయే. మరో విషయం ఏమంటే మొన్నటి ఎన్నికల్లో ఎన్నారైలు అంతా గంపగుత్తగా ట్రంప్‌కు ఓటేశారు. ఈ కృతజ్ఞత కూడా ట్రంప్‌కు లేకుండా పోయింది. అక్కడున్న మేథావులంతా భారతీయులే అని కూడా ట్రంప్ గుర్తించ కుండా టెక్కీలపై ఆంక్షలు విధిస్తున్నాడు. ఈ విషయం గుర్తించకుండా ట్రంప్ కక్రపెత్తనం చేయబోయారు.

ప్రస్తుతం క్లిష్టమైన సమయం నడుస్తున్నది. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అచ్చోసిన ఆంబోతులా టారిఫ్ దురాక్రమణ చేపట్టాడు. ఇలాంటి నేపథ్యంలో తియాన్‌జిన్ సమావేశం ట్రంప్ దృష్టిని ఆకర్షించింది. ఇదో రకంగా ట్రంప్‌కు వ్యతిరేకంగా జరిగిందా అన్న రీతిలో మూడు ప్రధాన దేశాలు ఐక్యతను చాటాయి. ట్రంప్ టారిఫ్‌లపై రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా విరుచుకు పడ్డారు. ఇది ఏకపక్షమని అన్నారు. చైనా, భారత్ లాంటి దేశాలను దూరం చేసుకోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. అమెరికా నాయకత్వం ప్రపంచ వ్యవస్థకు మరింత వేగవంతమైన తక్షణ ప్రతిస్పందన కావాలనే హడావుడి చేస్తోంది. షాంఘై సదస్సు ఏం సాధించిందన్న దానికి ట్రంప్ అంతర్మథనం అద్దం పడుతుంది. ఈ మార్పు నిస్సందేహంగా ఒక బహుళ ధృవ ప్రపంచం అవసరాన్ని తెరపైకి తీసుకుని వచ్చింది. తియాన్‌జిన్ రేవు పట్టణం షాంఘై సహకార సమితి శిఖరాగ్ర సమావేశానికి ఘనంగా ఆతిథ్యమిచ్చింది. ఎస్.సి.వో తన పరిధిని విస్తరించుకుని ఆర్థిక సహకారం, సాంస్కృతిక సంబంధాలు, ఇంధన రంగాలను కూడా చేర్చుకుంది. 21వ శతాబ్ది సవాళ్లనూ అవకాశాలను ఎస్.సి.వో స్వీకరించిందని చెప్పడానికి సంకేతమా అన్నట్లు- చైనా ఇటీవలి కాలంలో సాధించిన ఆశ్చర్యకర పురోగమనాన్ని ప్రతిబింబించే ప్రదర్శన నిర్వహించింది. ఇండియా రష్యా నుంచి చమురు కొని ఎక్కువ లాభానికి అమ్ముకుంటున్నదనే సాకు ప్రధానంగా ముందుకు తెచ్చి భారత్, బ్రెజిల్ దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు దారుణంగా వేటు- వేశాయి. నిజానికి ట్రంప్ ఉన్మాదపూరితంగా తయారైనాడు. భారత దేశ ఆర్థిక వ్యవస్థ నిర్జీవంగా తయారైందనీ, దాంతో వ్యాపారం చేయడమంటే కోరి ఏకపక్ష వినాశనం కొని తెచ్చుకోవడమేననీ నోరు పారేసుకున్నాడు. సైనిక ఘర్షణల విరమణలో తన పాత్రకు భారత్ తగినంత గుర్తింపునివ్వలేదని కూడా ట్రంప్ కుదేలైపోయాడు. ఆయన సహాయకులొకరైతే రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి భారత్ కారణమనేంత వరకూ వెళ్లారు. ఇవన్నీ ఎంత వరకూ నిజాలో ఎవరైనా ఊహించుకోవచ్చు. ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకునే విధంగా భారత్‌ను లొంగదీసు కోవడమే ఇక్కడ అమెరికా ప్రధానోద్దేశంగా ఉంది. బహుళ ధృవ ప్రపంచ దృశ్యం, సామర్థం, సత్తా ఏమిటో తియాన్‌జిన్ చూపెట్టింది. సీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్, నరేంద్ర మోడీలు అక్కడ వుండటం సుస్థిర ప్రపంచ వ్యవస్థను నొక్కి చెప్పింది. ప్రాంతీయ, ప్రపంచ భద్రతపై ఎస్.సి.వో కేంద్రీకరించింది. ఇజ్రాయిల్, అమెరికాల సైనిక దాడులను తీవ్రంగా ఖండించింది. అవి అంతర్జాతీయ చట్టాలనూ ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘించేవిగా వున్నాయి. ఇరాన్ సార్వభౌమాధికారానికి తూట్లు పొడిచేవిగా జరిగాయని పేర్కొంది. తియాన్‌జిన్ సమావేశానికి ముందు మోడీ, జిన్‌పింగ్‌లు శిఖరాగ్ర సమావేశం జరిపినప్పుడే గాలి ఎటు- వీస్తున్నదీ స్పష్టమైపోయింది. భారత్, చైనాలు భాగస్వాము లేగానీ విరోధులు కాద న్నది ఉమ్మడి స్ఫూర్తిగా వచ్చిన ప్రధాన సందేశం. బహుళ ధృవ ప్రపంచం, వాణిజ్య స్వేచ్ఛను ప్రముఖంగా చెబుతూ న్యాయమైన, సహేతుకమైన పరస్పర అంగీకార యోగ్యమైన పరిష్కారాలను కనుగొనాలని ఈ రెండు దేశాలు అవగాహనకు వచ్చాయి. విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొన్నట్టుగా ప్రపంచ వాణిజ్య సుస్థిరత సాధించడంలో ఉభయ దేశాల ఆర్థిక వ్యవస్థల పాత్రను ప్రస్తావించాయి. విధానపరమైన స్వీయ నిర్ణయాధికారాన్ని ఇరు దేశాలు పాటిస్తాయి. ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకునే దిశలో బహుముఖ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని సీ జిన్‌పింగ్ పేర్కొన్నారు. మొత్తం భారత్, చైనా సంబంధాలను సరిహద్దు సమస్యను బట్టి మాత్రమే నిర్ణయించరాదని కూడా ఆయన చెప్పారు. ఈ క్రమంలో విశాల భౌగోళిక దృష్టితో భారతదేశ ప్రయోజనాలను ట్రంప్ చూడటం లేదని తేలిపోయింది. ఆసియాలో బలాబలాల సమతుల్యతకు సంబంధించి భారత దేశం విలువేమిటో ఆయనకు తెలియలేదని అర్థమై పోయింది. భారత అమెరికా సంబంధాలను గమనిస్తున్న వారికి మాత్రం ఇది పెద్ద ఆశ్చర్యం కలిగించదు. ఇది ఎప్పుడో జరగవలసి వున్నదే. ఆపరేషన్ సిందూర్ తర్వాత ..కాల్పుల విరమణకు తానే కారణమంటూ ఉన్మాద పూరితంగా ట్రంప్ ఏకపక్షంగా చెప్పుకోవడం చూసినప్పుడే ట్రంప్ టెంపరితనం ప్రపంచానికి అర్థం అయ్యింది. ఇండియా, పాకిస్తాన్‌లను ఒకే గాటకట్టి చూడటం కూడా ట్రంప్ కుంచిత త్వానికి పరాకాష్టగా చూడాలి. అమెరికాతో వాణిజ్యంలో దానిపై ఆధారపడటాన్ని వదులుకోవడం వల్ల కలిగే పెద్ద దెబ్బను తట్టుకోవడానికి భారత్ సిద్దం కావాలి. స్వదేశీ నినాదంతో ముందుకు సాగాలి. మనం అమెరికాపై ఆధారపడకుండా అవసరమైన మేర బతకడం నేర్చుకుంటే ట్రంప్‌కు పట్టిన దయ్యం దిగివస్తుంది.

# ‘షాంఘై’లో భారత్ సాధించిందేమిటి



చైనాలోని తియాన్‌జిన్‌లో జరిగిన షాంఘై సహకార సదస్సు ప్రపంచ దేశాలను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ సదస్సు ఫోటోలు వెల్లువలా వైరల్ అయ్యాయి. అమెరికాకు, అధ్యక్షుడు ట్రంప్‌కు గట్టి సందేశం పంపడమే ఈ సదస్సు లక్షం. కానీ ఈ ప్రతీకవాదానికి అతీతంగా భారత దేశానికి సంబంధించి ఏదైనా నిజమైన ప్రాముఖ్యతను కలిగి ఉందా భారతదేశం తన లక్షాలను ఏవైనా సదస్సులో ప్రస్తావించగలిగిందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతర్జాతీయ సంస్థలు చాలా తక్కువగా పాల్గొనే సదస్సుల్లో షాంఘై ఒకటి. అమెరికా టారిఫ్‌ల షాక్‌కు గురవుతున్న భారత్‌కు ఈ పరిస్థితుల్లో అనుకూల ప్రత్యామ్నాయ అవకాశం చైనా అనిపించింది.చైనా ఆతిథ్యంలో షాంఘై సదస్సులో భారత్ అమితాసక్తితో పాల్గొనడం భారత్‌కు ఇతర అవకాశాలు ఉన్నాయని అమెరికాకు గట్టి సందేశం ఇచ్చినట్టయింది. భారత దేశ వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తికి పర్యాయ వేదికలుగా షాంఘై, బ్రిక్స్ సదస్సులు ఉంటున్నాయి. కొంతమందికి అవి భారత సార్వభౌమత్వాన్ని, ఆత్మాభిమానాన్ని నొక్కి చెబుతాయి. భారత దేశం రష్యా, చైనా వంటి గొప్పశక్తుల వైపు మొగ్గు చూపుతోందనే సందేశం అందిస్తోంది. భారత్ భౌగోళిక రాజకీయ, ఆర్థిక భవిష్యత్ అవసరాల దృష్టా షాంఘై సదస్సు ప్రయోజనాన్ని ప్రశ్నించడానికి ఇదే సరైన సమయం. షాంఘై సదస్సు యురేసియా దేశాల కూటమి. ఇందులో రష్యా, చైనా, ఇరాన్, మధ్య ఆసియా దేశాల భాగస్వామ్యం ఉంటోంది. ఈ కూటమిలో భారత్, పాక్ కూడా ఉన్నాయి. భారత్ వలె కాకుండా ఈ దేశాలన్నీ అప్రజాస్వామికమైనవి. మానవ హక్కులపై ప్రశ్నించే రికార్డు వీటికి ఉంది. ఇవి తమ విదేశీ విధానంలో పశ్చిమదేశాలపై వ్యతిరేకత ప్రతిబింబిస్తుంది. పశ్చిమదేశాలపై ఇవి తిరుగుబాటు సభ్యదేశాలుగా ప్రచారం పొందాయి. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం ఈ మూడు దేశాలను మరింత సన్నిహితం చేశాయి. భారత్ మాత్రం పశ్చిమదేశాలకు వ్యతిరేకం కాదు కానీ, పశ్చిమేతర దేశం. ఈ విషయాన్ని స్పష్టం చేయడానికి భారత్ చాలా కష్టపడుతోంది. అయితే షాంఘై సదస్సు తన వైఖరిలో పశ్చిమదేశాలపై వ్యతిరేకతను స్పష్టంగా చూపిస్తోంది. ప్రపంచ దేశాల వ్యవహారాల్లో అమెరికా ఆధిపత్యం పెరిగిపోతున్న కాలం లోనే ఈ షాంఘై సదస్సు ఆవిర్భవించింది.అమెరికా విధానంలో మార్పులపై భారత్ ఆందోళన చెందుతున్నప్పటికీ, టెహ్రాన్, మాస్కో, బీజింగ్ దేశాల వారితో భారత్ సహజంగా పొత్తు పెట్టుకోలేదు. చైనా తప్ప ఈ దేశాలేవీ భారత్‌కు ప్రధాన ఆర్థిక భాగస్వాములు కావు. 2022లో ఉక్రెయిన్‌పై దాడి తరువాత రష్యా ఒక్కటే భారత్‌కు మిత్రదేశంగా నిలిచింది. భారత్ రష్యా ద్వైపాక్షిక వాణిజ్యం ద్వారా రష్యా నుంచి మనం చమురు తీసుకుంటున్నా మొత్తం వాణిజ్యం గణాంకాలు చాలా సూక్ష్మమైనవే. యురేసియన్ ఎకనామిక్ యూనియన్‌లో భారత ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ బ్రిటన్, దక్షిణ కొరియా, వంటి ప్రధాన ఆర్థిక దేశాల స్వేచ్ఛా వాణిజ్యంతో సరిపోల్చలేం. అందువల్ల షాంఘై సహకార సదస్సు వినియోగం ఆర్థిక రంగంలో పరిమితమే. ఇది ప్రధానంగా రాజకీయ భద్రతా కూటమిగా కొనసాగుతుంది.ఆ కోణంలో చూసినా భారత్ ఏం పొందగలుగుతుంది భద్రతాపరంగా చైనా, పాకిస్తాన్ దేశాల నుంచే సవాళ్లను భారత్ ఎదుర్కొంటోంది. ఈ దేశాల సవాళ్లలో ఏదైనా పరిష్కరించడానికి షాంఘై సదస్సు సహకరిస్తుందా అన్నది ప్రశ్నార్థకం. తూర్పు లద్దాఖ్ సరిహద్దు ప్రతిష్టంభన లేదా ఆపరేషన్ సిందూర్‌లో కానీ చైనా నుంచి భారత్‌కు మద్దతు లేదా సానుభూతి ఏదీ లభించడం లేదు. ప్రస్తుతం భారత్ చైనా సంబంధాలు మళ్లీ పెనవేసుకుంటున్నప్పటికీ భారత్‌కు వ్యతిరేకంగా తమ విధానాలను అనుసరించడమే చైనా, పాకిస్థాన్ లక్షాలుగా గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నాయి. షాంఘై సదస్సు నుంచి పహల్గాం ఉగ్రదాడిపై నిరసన ప్రకటన వెలువడినప్పటికీ, అలాంటి సంయుక్త ప్రకటన పాకిస్థాన్ లోని జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై దాడి విషయంలోనూ వెలువడిన విషయం గుర్తుంచుకోవాలి.అందువల్ల పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ షాంఘై సదస్సులో ప్రతీకాత్మక ప్రస్తావన ఒక స్వల్ప ఎత్తుగడ మాత్రమే. ఈ సదస్సు రాజకీయంగా భారీ సంకేతాలు అందించినా, అసలు వాస్తవ విషయాల ప్రస్తావన మాత్రం కంటితుడుపుగా మిగిలాయి. పశ్చిమ దేశాల నుంచి పెట్టుబడులు రాబట్టడం, సాంకేతిక సహకారం పొందడం, వాణిజ్యాభివృద్ధి ఇవే భారతదేశ పరివర్తనకు కీలకం. ఇవి సాధించాలంటే అమెరికా, ఐరోపా, ఆస్ట్రేలియా, తూర్పు ఆసియా దేశాలతో సంబంధాలు పెంపొందించుకోవడం తప్పనిసరి. ఈ దేశాలతో షాంఘై సదస్సు సభ్యదేశాలకు పోలిక ఏమాత్రం లేదు. టారిఫ్‌ల అస్తవ్యస్త ప్రపంచంలో భారత్ ఐరోపా యూనియన్ దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య బంధాలను వేగంగా పెంపొందించుకోవడమే ప్రత్యామ్నాయం.అలాగే ఆగ్నేయాసియా, తూర్పు ఆసియా దేశాలతో ఆర్థిక మైత్రీ బంధాలు పటిష్టం కావలసి ఉంది. చైనాపాకిస్థాన్ సంబంధాలు మరింత గాఢంగా బలపడడం, అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంలో పాకిస్థాన్‌కు చోటు కల్పించడం భారత్‌కు మంచి పరిణామాలు కావు. అయినప్పటికీ అమెరికా నుంచి భారత్ దూరం కావాలనుకోవడం సరైన వ్యూహం కాదు. అలాగే భారత్ ఎదుర్కొంటున భౌగోళిక రాజకీయ, ఆర్థిక సమస్యల విషయంలో షాంఘై సదస్సు ఉపయోగపడుతుందని భావించడం ఎండమావి వంటిది. కానీ షాంఘై సదస్సులో పాల్గొనడానికి చైనా వెళ్లడం ఉత్పాదక ప్రయోజనం కలిగించిందని భారత ప్రధాని మోడీ అభివర్ణిస్తున్నారు. కానీ మోడీ పర్యటన కొన్ని అవకాశాలను కోల్పోయిందన్న వ్యాఖ్యలు వస్తున్నాయి.

# చిన్న దేశం.. గొప్ప సందేశం

‘మీ దేశంలో మా నిధులతో 400 మసీదులు నిర్మిస్తాం. ఇది మేము ఎంతో ఉదారతతో చేస్తున్నాం. దీనికి మీ అంగీకారం కావాలి’ ఇది సౌదీ అరేబియా ప్రధాని మహ్మద్ బిన్ సాపోన్, పశ్చిమ ఆఫ్రికాలోని బుర్కిన ఫాసో దేశాధ్యక్షుడు ఇబ్రహీం ట్రవోరేకు సందేశం పంపారు. సాధారణంగా, పేద దేశాలకు చెందిన దేశాధినేతలెవరైనా అత్యంత ధనిక దేశమైన సౌదీ అరేబియా మాటలను శిరోధార్యంగా భావిస్తారు. అంతేకాకుండా, మరి కొంత సహాయాన్ని అర్థిస్తారు. కానీ ట్రవోరే మాత్రం అందరి అంచనాలకు విరుద్ధంగా జవాబిచ్చారు. “మా దేశంలో ఇప్పుడు మసీదులు, ప్రార్థనా స్థలాలు కాదు కావాల్సింది. ఎటువంటి నిర్మాణాలు లేకుండా, ఆకాశం కింద ఎక్కడైనా ప్రార్థనలు చేయగలం. పాలస్తీనాలో వేలాది మంది నిరాశ్రయులు, ప్రత్యేకించి పిల్లలు ఎటువంటి సహాయం అందకుండా దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు.వారికి సాయం చేయండి మాకు ఎవరి ధాతృత్వం అక్కర లేదు. ఈ రోజు మా దేశానికి పాఠశాలలు, వైద్యశాలలు, పరిశ్రమలు, రహదారులు, ప్రాజెక్టులు కావాలి. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన జరగాలి” అంటూ ఘాటైన సమాధానమిచ్చారు. ఇది ప్రపంచంలోని అనేక మంది పరిశీలకులను ఆశ్చర్యపరిచింది. బుర్కిన ఫాసో ఆఫ్రికాలోని ఒక చిన్నదేశం. గత ఎన్నో ఏళ్లుగా ఫ్రెంచి వలస పాలనలో మగ్గిన దేశం. 1960 ప్రాంతంలో ఫ్రెంచి పాలకులు ప్రత్యక్షంగా దేశాన్ని వదిలిపెట్టినప్పటికీ, పరోక్షంగా ఫ్రెంచి వ్యాపారస్థులు, పెట్టుబడిదారులు బుర్కిన ఫాసోను పీల్చిపిప్పి చేస్తూనే ఉన్నారు. అయితే 2022 నుంచి ఆ దేశం నడక మారింది. ఇప్పటి దాకా ఆకలి, అవమానం, అనారోగ్యం, నిరుద్యోగాలతో విలవిలలాడిపోయిన బుర్కిన ఫాసో వాటన్నింటికీ చరమ గీతం పాడాలనుకుంది. అదే ఇబ్రహీం ట్రవోరే నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం బుర్కిన ఫాసో చరిత్రను తిరగ రాయబోతున్నది.“ప్రపంచంలోనే అత్యధిక బంగారు నిల్వలు కలిగిన ఆఫ్రికా ఖండం, ప్రత్యేకించి బుర్కిన ఫాసో ఎందుకు పేదరికంతో ఉంది ఇక్కడ ఆకలితో ప్రారంభమైన జీవితాలు అనారోగ్యం పాలవడం మాత్రమే కాకుండా, హింస, దాడులు, చావులు ఎందుకు దర్శనమిస్తున్నాయి దీనికి కారణం మా వనరులను ఇతరులు ప్రత్యేకించి వలసవాదాలు దోచుకుపోవడమే దీనికి కారణం” అంటూ ఇబ్రహీం ట్రవోరే తన తిరుగుబాటు జెండాను ఎత్తారు. ఇబ్రహీం ట్రవోరే 36 సంవత్సరాల యువకుడు. మార్చి 14, 1988న ఇబ్రహీం ట్రవోరే బుర్కిన ఫాసోలోని మౌహాన్ ప్రాంతంలోని కెరలో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాస్యాన్ని తన సొంత ప్రాంతంలో ముగించుకొని దేశ రాజధాని ఒగడొగవ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. ఆయన విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో అసోసియేషన్ ముస్లిం స్టూడెంట్స్, మార్క్సిస్టు నేషనల్ అసోసియేషన్ స్టూడెంట్స్ సంస్థలతో కలిసి పని చేశారు. ఆ తర్వాత 2009 సంవత్సరంలో బుర్కిన ఫాసో సైన్యంలో చేరారు.అప్పటి నుంచి 2020 వరకు వివిధ హోదాల్లో సైన్యంలో పని చేశారు. ఆ సంవత్సరమే ఆయన కెప్టెన్‌గా పదోన్నత పొందారు. అయితే 2009 సంవత్సరం నుంచి సైన్యంలో చేరినప్పటి నుంచి ఇబ్రహీం దేశంలోని రాజకీయ నాయకుల, వలస కంపెనీల దోపిడీ భాగస్వామ్యాన్ని అర్థం చేసుకున్నారు. ఈ రెండు వర్గాలు దేశ సంపదను దోచుకుపోతున్నారని, దాని వల్లనే ఈ దారిద్ర్యం దాపురించిందని బలంగా అభిప్రాయపడ్డారు. ఆ ప్రేరణతోనే 2022 అక్టోబర్‌లో తన నాయకత్వంలోని సైన్యంతో తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్నారు.



ఇది ఆ దేశంలో కొత్తేమీ కాదు. గతంలో కూడా 1963లో సెంకర అనే స్వతంత్ర స్వభావం కలిగిన నాయకత్వంలోని ప్రభుత్వాన్ని కొంత మంది కలిసి కూలదోశారు. దానికి ఫ్రాన్స్‌తో సహా అమెరికా ఇతర దేశాలు పరోక్ష మద్దతు ఉన్నది.సెంకర అనే బుర్కిన ఫాసో నాయకుడు ఆ దేశాన్ని స్వేచ్ఛగా ఇతరుల జోక్యం లేకుండా పాలన సాగించాలని ప్రయత్నించారు. కానీ ఆయనను అతి తొందరలోనే కూలదోసి మళ్లీ వలస పాలకుల తొత్తులతో ప్రభుత్వాలను నడిపారు. అయితే ఇబ్రహీం ట్రవోరే మళ్లీ తాను సెంకర స్ఫూర్తితో పాలన సాగించాలనుకుంటున్నానని, తనకు సెంకర సిద్ధాంతాలు, ఆశయాలు మార్గదర్శకమని ప్రకటించారు. అయితే సెంకర లాంటి ఆఫ్రికా జాతీయవాదులకు, ఇబ్రహీం ట్రవోరేకు చాలా తేడా ఉన్నది. ఇబ్రహీం ట్రవోరే కేవలం సైన్యంతో పాలన సాగించాలనుకోవడం లేదు. ఆయన అధ్యక్ష పదవి చేపట్టిన వెంటన చాలా ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. అందులో ముఖ్యమైన స్వయం సమృద్ధి. స్వేచ్ఛపాలన ఇప్పటి వరకు తమ బంగారు నిల్వలన దోచుకునిపోయి, తమకు దారిద్ర్యాన్ని మిగుల్చుతున్న కంపెనీలను పూర్తిగా వెనక్కు పంపారు. అంటే బంగారు గనులతోపాటు అనేక గనులను జాతీయం చేశారు.ఇప్పటి వరకు బంగారు ముడి పదార్థాన్ని ఇక్కడి నుంచి తరలించుకొని పోయి ఫ్రాన్స్, ఆస్ట్రేలియా లాంటి దేశాలు తమ తమ ప్రాంతాల్లో దానిని శుద్ధిచేసి తామే బంగారు నిల్వలు గల దేశాలుగా చెలామణి అవుతున్నాయి. ఇంకొక్క ముఖ్య విషయమేమంటే ప్రపంచంలో ఉన్న బంగారు నిల్వలలో 40 శాతం కేవలం ఆఫ్రికా ఖండంలోనే ఉన్నాయి. అందులో సహెలి ప్రాంతంలోనే అత్యధిక నిల్వలున్నాయి. సహెలి అంటే బుర్కిన ఫాసో, నైజర్, మాలి, చాడ్‌లలో కూడిన ప్రాంతం. బుర్కిన ఫాసోలో 6.5 మిలియన్ మెట్రిక్ బంగారు నిల్వలున్నాయి. అందుకే ఇబ్రహీం ట్రవోరే తమ దేశానికి ఎవరి సహాయం అక్కర లేదని ప్రకటించారు. ఆయన మొదటి చర్యగా బంగారాన్ని శుద్ధి చేసే కర్మాగారాన్ని బుర్కిన ఫాసోలో ఏర్పాటు చేశారు. దానితో తమ బంగారాన్ని తామే వెలికి తీసి తామే దానిని శుద్ధి చేసి తామే అమ్ముతామని ప్రకటించారు.ఇది బుర్కిన ఫాసో జీవనాడి. ఒక్క కలం పోటుతో ఇతర దేశాల కంపెనీలను సరిహద్దులు దాటించారు. ఇది చాలా కీలకమైనది.రెండో చర్యగా మార్చి 11, 2025 న ఒక పెద్ద వ్యవసాయక పథకానికి శ్రీకారం చుట్టారు. 1200 వందల కిలోమీటర్ల దూరం పంట కాలువను తవ్వాలని నిర్ణయించుకున్నారు. దానికి కావాల్సిన నిధులను ఇప్పటికే కేటాయించారు. దీనికి ఎటువంటి నది లేదు. బుర్కిన ఫాసోలో వ్యవసాయం పూర్తిగా వర్షాభావమే. ఎటువంటి నీటి వనరులు లేవు. దానితో 80 శాతంగా ఉన్న వ్యవసాయ జనాభా పూర్తిగా వాననీటి మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని ఇబ్రహీం ట్రవోరే ఒక నూతన ఆలోచనకు శ్రీకారం చుట్టారు. ఇది వినూత్న ప్రయోగం. నదులకు ఆనకట్ట కట్టి నీటిని కాలువల ద్వారా పారించడం లేదు.

# రాస్ టేలర్ సంచలన నిర్ణయం..

## • రిటైర్‌మెంట్ వెనక్కి..



న్యూజిలాండ్ దిగ్గజ ఆటగాడు రాస్ టేలర్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. తన రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు 2021 డిసెంబర్ 30న వీడ్కోలు పలికిన టేలర్ తాజాగా తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాడు. అయితే.. ఈ సారి అతడు న్యూజిలాండ్ తరుపున ఆడడం లేదు. సయోవా అనే పసికూన జట్టు తరుపున బరిలోకి దిగనున్నాడు. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా టేలర్ వెల్లడించాడు 'రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నాను. సయోటా జట్టుకు ప్రాతినిధ్యం వహించబోతున్నందుకు ఎంతో గర్వపడుతున్నా. ఇదొక గొప్ప పునరాగమనంగా మారుతుందని ఆశిస్తున్నాను. నా వారసత్వం, సంస్కృతి తరుపున ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవం. జట్టుతో కలిసి నా అనుభవాలను పంచుకుంటా.' అని 41 ఏళ్ల టేలర్ శుక్రవారం తెలిపాడు. వెల్లింగ్‌టన్‌కు చెందిన రాస్ టేలర్ 2006లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగ్రేటం చేశాడు. కివీస్ తరుపున 112 టెస్టులు, 236 వన్డేలు, 102 టీ20లు ఆడాడు. టెస్టుల్లో 44.7 సగటుతో 7683 పరుగులు చేశాడు. ఇందులో 19 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇక వన్డేల్లో 47.5 సగటుతో 8607 పరుగులు చేశాడు. ఇందులో 21 శతకాలు, 51 అర్ధశతకాలు ఉన్నాయి. ఇక టీ20ల్లో 26.1 సగటుతో 1909 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు అర్ధశతకాలు ఉన్నాయి. టేలర్ 2008 నుంచి 2014 వరకు ఐపీఎల్ ఆడాడు. 55 మ్యాచ్‌ల్లో 25.4 సగటుతో 1017 పరుగులు సాధించాడు. ఇందులో మూడు అర్ధశతకాలు ఉన్నాయి. రాస్ టేలర్ తల్లి సయోవా మూలాలు కలిగి ఉంది. ఆమె వారసత్వంతోనే టేలర్ కు సమోవా పాస్‌పోర్టు కూడా వచ్చింది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం అతడు మరో జట్టు తరుపున ఆడేందుకు నిరీక్షించాల్సిన మూడేళ్ల సమయం పూర్తైంది. 2026లో టీ20 ప్రపంచకప్ టోర్నీ జరగనుంది. ఈ టోర్నీకి సయోవా అర్హత సాధించాలంటే క్వాలిఫయర్స్ టోర్నీ ఆడాల్సి ఉంటుంది. ఆసియా-పసిఫిక్ రీజియన్ తరుపున క్వాలిఫయర్‌లో సమోవా అద్భుత ప్రదర్శన చేయాల్సి ఉంటుంది.

# వరుసగా మూడోసారి ఫైనల్‌కు
# దూసుకెళ్లిన అల్కరాస్



2025 యూఎస్ ఓపెన్‌లో టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ పోరాటం ముగిసింది. తాజాగా జరిగిన పురుషుల సింగిల్స్ సెమీఫైనల్‌లో ప్రపంచ నంబర్ 2 కార్లోస్ అల్కరాస్‌ను ఢీ కొట్టిన జకోవిచ్ 6-4, 7-6 (4), 6-2 తేడాతో ఓడిపోయాడు. దీంతో జకోవిచ్ యూఎస్ ఓపెన్ నుంచి నిష్క్రమించాడు. అసాధారణ పోరాటంతో మ్యాచ్‌లో నెగ్గిన అల్కరాస్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. కాగా, అల్కరాస్‌కు ఇది వరుసగా మూడో గ్రాండ్ స్లామ్ ఫైనల్ కావడం విశేషం. ఈ సెమీస్‌లో 22 ఏళ్ల అల్కరాస్ పూర్తి ఆధిపత్యం సాధించాడు. తొలి సెట్‌లోనే జకోవిచ్‌ను 6- 4తేడాతో ఓడించి లీడ్‌లోకి దూసుకెళ్లాడు. ఇక రెండో సెట్‌లో ఇద్దరూ నువ్వా నేనా అన్నట్లు సాగింది. ఈ సెట్‌లో జకోవిచ్ బాగా పోరాడాడు. అల్కరాస్‌కు అంత ఈజీగా ఇవ్వలేదు. దీంతో గేమ్ టై బ్రేక్‌కు వెళ్లింది. అయినప్పటికీ పట్టు వదలని అల్కరాస్ ఈ సెట్‌నూ 7-6 (7/4) తో గెలుచుకున్నాడు. రెండో సెట్ హెూరాహెూరీగా సాగగా, మూడో సెట్ మాత్రం వన్‌సైడ్‌గా సాగిపోయింది. తొలి రెండు సెట్లలో ఉన్న అదే జోరును అల్కరాస్ కొనసాగించాడు. దీంతో ఆఖరి సెట్‌లో అతడికి జకోవిచ్ నుంచి ఎలాంటి పోటీ ఎదురుకాలేదు. ఈ సెట్‌ను అల్కరాజ్ 6-2 తేడాతో ఈజీగా గెలుచుకొని, ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. కాగా, అల్కరాస్ ఈ ఫైనల్‌లో స్థానం సాధించిన తొలి ప్లేయర్‌గా నిలిచాడు. అలాగే ఫైనల్‌లో జనిక్ సినర్‌తో అల్కరాజ్ తలపడనున్నాడు. మరోవైపు, పురుషుల సింగిల్స్‌లో రెండో సెమీస్‌లో జనిక్ సినర్ (ఇటలీ)-ఫెలిక్స్ (కెనడా) పోటీపడ్డారు. ఈ మ్యాచ్‌లో జనిక్ సినర్ అద్భుత విజయం నమోదు చేశాడు. అతడు ఫెలిక్స్‌పై 6-1, 3-6, 6-3, 6-4 తేడాతో విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో తొలి సెట్ నెగ్గిన సినర్, రెండో సెట్‌లో తడబడ్డాడు. ఈ రౌండ్‌లో ఫెలిక్స్ 3-6తో నెగ్గాడు. ఆ తర్వాత రెండు వరుస సెట్లలో సినర్ అధిక్యం ప్రదర్శించాడు. ప్రత్యర్థికి అవకాశం ఇవ్వకుండా రెచ్చిపోయాడు. ఫలితంగా చివరి రెండు సెట్లను 6-3, 6-4 తేడాతో గెలుచుకున్నాడు. దీంతో ఫైనల్‌కు అర్హత సాధించాడు. అతడు అల్కరాస్‌తో టైటిల్ పోరులో ఆడనున్నాడు. ఈ ప్రతిష్ఠాత్మకమైన ఫైనల్ మ్యాచ్ సెప్టెంబర్ 07న జరగనుంది.కాగా, ఈ మ్యాచ్‌కు ముందు జకోవిచ్ అరుదైన ఘనత సాధించాడు. 38ఏళ్ల వయసులో 14వసారి యూఎస్ ఓపెన్ సెమీస్‌కు అర్హత సాధించాడు. ఈ క్రమంలో అత్యధికసార్లు ఈ ఘనత సాధించిన జిమ్మీ కానర్స్ (14) రికార్డును సమం చేశాడు. దీంతోపాటు ఒకే కేలండర్ ఇయర్‌లో నాలుగు గ్రాండ్‌స్లామ్స్ సెమీస్ ఫైనల్స్‌కు అర్హత సాధించిన ప్లేయర్‌గానూ జకోవిచ్ రికార్డు కొట్టాడు.ఒకే కేలండర్ ఇయర్‌లో నాలుగు గ్రాండ్‌స్లామ్స్ సెమీస్ ఫైనల్స్‌కు అర్హత సాధించడం జకోవిచ్‌కు ఇది ఏడోసారి. అయితే ఈ ఘనత సాధించిన అత్యంత పెద్ద వయస్కుడు జకోవిచ్ కావడం విశేషం. ఈ ఘనత సాధించిన నాటికి జకోవిచ్ వయసు 38 ఏళ్ల 94 రోజులు.

# ఆసియా కప్‌లో భారత్ రికార్డులు

## • ఈ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ గా బరిలోకి..

2025 ఆసియా కప్‌కు సమయం దగ్గరపడుతోంది. మరో మూడు రోజుల్లోనే ఈ మినీ టోర్నమెంట్‌కు తెర లేవనుంది. దుబాయ్ వేదికగా టీ20 ఫార్మాట్‌లో టోర్నీ జరగనుంది. సెప్టెంబర్ 09న ప్రారంభమై, ఇదే నెల 28న ముగుస్తుంది. అయితే 1984లో ప్రారంభమైన ఈ టోర్నీ సక్సెస్‌ఫుల్‌గా 16ఎడిషన్లు పూర్తి చేసుకుంది. ఇక 17వ ఎడిషన్‌కు సర్వం సిద్ధమైంది. ఈ టోర్నీలో భారత్ డిఫెండింగ్ ఛాంపియన్ హెూదాలో బరిలోకి దిగనుంది. అయితే మినీ వరల్డ్‌కప్‌గా పిలుచుకునే ఈ ఆసియా కప్‌లో భారత్‌దే పూర్తి డామినేషన్ ఉంది. ఈ టోర్నీ ప్రారంభం నుంచి చివరి ఎడిషన్ (2023) దాకా అనేకసార్లు టీమ్‌ఇండియా ఆధిపత్యం ప్రదర్శించింది. గడిచిన కొన్నేళ్లలో అనేక రికార్డులు నెలకొల్పింది. ఆయా రికార్డులు ఇప్పటివరకు అసలు బ్రేక్ అవ్వలేదు.ఆసియా కప్‌లో భారత్ అత్యధిక సార్లు ఛాంపియన్‌గా నిలిచిన జట్టుగా కొనసాగుతోంది. హిస్టరీలో ఏకంగా 11సార్లు ఫైనల్‌కు చేరిన భారత్, ఇప్పటివరకు ఎనిమిదిసార్లు టైటిల్ నెగ్గింది. మరే ఇతర జట్టు కూడా ఇన్నిసార్లు ఛాంపియన్‌గా నిలవలేదు. భారత్ తర్వాత అత్యధికంగా శ్రీలంక



ఆరుసార్లు టైటిల్ సాధించింది. ఇక ఈసారి కూడా టీమ్‌ఇండియా టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.16ఎడిషన్ల ఆసియా కప్ చరిత్రలో ఈ టైటిల్‌ను వరుసగా మూడుసార్లు గెలుచుకున్న రికార్డు భారత్ పేరిటే ఉంది. టీమ్‌ఇండియా 1988, 1991, 1995 ఎడిషన్లలో వరుసగా మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచింది. 2004, 2008 వరుసగా రెండుసార్లు శ్రీలంక టైటిల్ నెగ్గింది. కానీ హ్యాట్రిక్ కొట్టలేకపోయింది. టీమ్‌ఇండియా కూడా 2016, 2018లో రెండుసార్లు గెలిచింది. కానీ, 2022 లో ఓడిపోవడంతో రెండోసారి హ్యాట్రిక్ కొట్టే ఛాన్స్ మిస్ అయ్యింది.ఈ టోర్నీ ఫైనల్‌లో అతి తక్కువ బంతుల్లోనే మ్యాచ్ నెగ్గిన ఘనత టీమ్‌ఇండియాది. 2023 ఎడిషన్ టోర్నీలో భారత్ ఈ ఫీట్ నమోదు చేసింది. ఇందులో శ్రీలంకను ఎదుర్కొన్న భారత్ కేవలం 37 బంతుల్లోనే (6.1 ఓవర్లు) వికెట్ కోల్పోకుండా నెగ్గింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 15.2 ఓవర్లలోనే 50 పరుగులకే ఆలౌటైంది. మహ్మద్ సిరాజ్ 6, హార్దిక్ పాండ్య 3, జస్ప్రీత్ బుమ్రా 1 వికెట్ పడగొట్టారు. అనంతరం ఈ టార్గెట్‌ను భారత్ 6.1 ఓవర్లలోనే ఛేదించింది. ఆసియా కప్ ఇప్పటివరకు వన్డే, టీ20 ఫార్మాట్‌లో జరిగింది. అయితే ఈ టోర్నీలో అత్యధిక సిక్స్‌లు బాదిన రికార్డు టీమ్‌ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ పేరిట ఉంది. ఆసియా కప్‌లో రోహిత్ మొత్తం 37 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో 40 సిక్స్‌లు బాదాడు. అందులో వన్డేల్లో 28, టీ20 ఫార్మాట్‌లో 12 సిక్స్‌లు ఉన్నాయి. టోర్నీ హిస్టరీలో పరుగులు పరంగా భారీ విజయం సాధించింది కూడా టీమ్‌ఇండియానే. 2008 ఎడిషన్‌లో హాంకాంగ్‌పై భారత్ 256 పరుగుల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీ చరిత్రలో ఇదే అతిపెద్ద విజయం. ఈ రికార్డు ఇప్పటికీ భారత్ పేరిటే ఉంది.

# శ్రేయస్ అయ్యర్‌కు ప్రమోషన్!

## • భారత్ ఏ జట్టుకు సారథిగా ఎంపిక



ఆసియా కప్ 2025 జట్టులో చోటు దక్కించుకోని టీమిండియా వెటరన్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కీలక బాధ్యతలు అప్పగించింది. భారత్ ఏ జట్టుకు శ్రేయస్ అయ్యర్‌ను సారథిగా ఎంపిక చేసింది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025తో పాటు ఐపీఎల్ 2024లో అసాధారణ ప్రదర్శన కనబర్చినా.. శ్రేయస్ అయ్యర్‌ను సెలెక్టర్లు పట్టించుకోలేదు. శుభ్‌మన్ గిల్ కోసం అతన్ని భారత జట్టులోకి తీసుకోలేదు. దాంతో సెలెక్టర్లపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. దాంతో తమ తప్పిదాన్ని సరిదిద్దుకునే క్రమంలోనే శ్రేయస్ అయ్యర్‌కు భారత్-ఏ జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించారనే వాదన వినిపిస్తోంది.అనధికారిక టెస్ట్‌లతో పాటు వన్డేలు ఆడేందుకు ఆస్ట్రేలియా-ఏ జట్టు భారత పర్యటనకు రానుంది. లక్నోలోని ఏక్‌నా స్టేడియంలో రెండు అనాధికార టెస్ట్‌లతో పాటు కాన్పూర్‌లో మూడు అనధికారిక వన్డేల్లో ఇరు జట్లూ తలపడతాయి. ఆస్ట్రేలియా-ఏ జట్టుతో రెండు అనధికారిక టెస్ట్‌లు ఆడే భారత్-ఏ జట్టును బీసీసీఐ శనివారం ప్రకటించింది.ఈ జట్టు సారథ్య బాధ్యతలను శ్రేయస్ అయ్యర్‌కు అప్పగించింది. ధ్రువ్ జురెల్ అతనికి డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. కేఎల్ రాహుల్‌తో పాటు మహమ్మద్ సిరాజ్ రెండో అనధికారిక టెస్ట్ ఆడుతారని పేర్కొంది. లక్నో వేదికగా సెప్టెంబర్ 16 నుంచి ఈ అనధికారిక టెస్ట్‌లు ప్రారంభం కానున్నాయి. 16 నుంచి 19 మధ్య తొలి అనధికారిక టెస్ట్, సెప్టెంబర్ 23 నుంచి 26 మధ్య రెండో అనధికారిక టెస్ట్ జరగనుంది. ఆసియాకప్ 2025 జట్టులో చోటు దక్కని శ్రేయస్ అయ్యర్.. దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. దులీప్ ట్రోఫీలో 2025లో వెస్ట్ జోన్‌కు ఆడుతున్న అయ్యర్.. తొలి ఇన్నింగ్స్‌లో 28 బంతుల్లో 25 పరుగులే చేసి వెనుదిరిగాడు. రుతురాజ్ గైక్వాడ్(184) భారీ శతకంతో రాణించగా.. యశస్వి జైస్వాల్(4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. వెస్ట్ జోన్‌కు సారథిగా వ్యవహరిస్తున్న శార్దూల్ ఠాకూర్(64) హాఫ్ సెంచరీతో రాణించాడు. జగదీశన్, రజత్ పటీదార్ కూడా మెరుగైన ప్రదర్శన చేశాడు.

## చరిత్ర సృష్టించడానికి
# అర్ష్‌దీప్ సింగ్ రెడీ

ఆసియా కప్ 2025 సెప్టెంబర్ 9 నుంచి యూఏఈలో ప్రారంభమవుతుంది. భారత జట్టు తమ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న ఆతిథ్య జట్టుతో ఆడనుంది. ఈ టోర్నమెంట్‌లో పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే అతను టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఒక ముఖ్యమైన రికార్డుకు చేరువలో ఉన్నాడు. ఇప్పటికే 99 వికెట్లు తీసిన అర్ష్‌దీప్.. మరో ఒక వికెట్ సాధిస్తే, ఈ ఫార్మాట్‌లో 100 వికెట్లు తీసిన మొదటి భారతీయ బౌలర్‌గా చరిత్ర సృష్టిస్తాడు.ప్రస్తుతం భారత టీ20ఐ వికెట్ల చార్ట్‌లో అర్ష్‌దీప్ సింగ్ తర్వాత యుజ్వేంద్ర చాహల్ 96 వికెట్లతో, హార్దిక్ పాండ్యా (94), జస్ప్రీత్ బుమ్రా (89) ఉన్నారు. మూడు అంకెల మార్క్‌ను చేరుకోవడం ద్వారా అర్ష్‌దీప్.. భారత బౌలింగ్ చార్ట్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకుంటాడు. ఈ లెఫ్ట్ హ్యాండ్ ఫాస్ట్ బౌలర్‌కు మరో అరుదైన రికార్డు సాధించే అవకాశం కూడా ఉంది. ఈ ఆసియా కప్‌లో అతను 100 వికెట్ల మార్క్‌ను చేరుకుంటే, ప్రపంచంలోనే ఈ ఘనత సాధించిన అత్యంత వేగవంతమైన పేసర్‌గా నిలుస్తాడు. ప్రపంచవ్యాప్తంగా రషీద్ ఖాన్ (అఫ్ఘనిస్థాన్), సందీప్ లమిచానే (నేపాల్), వనిందు హసరంగా (శ్రీలంక) మాత్రమే అతని కంటే ముందు ఈ ఘనత సాధించారు. అర్ష్‌దీప్ ఈ ఘనత సాధించిన నాల్గవ ఫాస్ట్ బౌలర్‌గా నిలుస్తాడు. అర్ష్‌దీప్ అరంగేట్రం చేసినప్పటి నుంచి, అతను ముఖ్యమైన సందర్భాలలో టీమ్ ఇండియాకు ప్రధాన బౌలర్‌గా నిలిచాడు. అతను ఆడిన 63 టీ20ఐ మ్యాచ్‌లలో 18.3 సగటుతో 99 వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ ఆరంభంలో, డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయ గల అతని కెపాసిటీ అతన్ని భారత జట్టుకు చాలా ముఖ్యమైన ఆస్తిగా మార్చింది. ఈ ఆసియా కప్‌లో ముఖ్యంగా సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో జరిగే బ్లాక్‌బస్టర్ మ్యాచ్ వంటి హై-ప్రెజర్ మ్యాచ్‌లు ఉండనున్నాయి. అర్ష్‌దీప్ చరిత్ర సృష్టించి భారత క్రికెట్ కు మరో అద్భుతమైన అధ్యాయాన్ని జోడిస్తాడేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.**ఆసియా కప్ 2025 కోసం భారత జట్టు:**సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభమన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), హర్షిత్ రానా, రింకు సింగ్.స్టాండ్‌బైలు: యశస్వి జైస్వాల్, ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్.




# డగౌట్ సలహాలు తీసుకోని ఏకైక ఐపీఎల్ కెప్టెన్ ధోనీ

## • మహేంద్ర సింగ్ ధోనీపై
## రికీ పాంటింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు



టీమిండియా మాజీ కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ సారథి మహేంద్ర సింగ్ ధోనీపై ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం, పంజాబ్ కింగ్స్ హెడ్ కోచ్ రికీ పాంటింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. డగౌట్ నుంచి సలహాలు తీసుకోని ఏకైక ఐపీఎల్ సారథి ధోనీనే అని తెలిపాడు. ప్రస్తుతం క్రికెట్ కూడా ఫుట్‌బాల్ మాదిరిగా మారిందని, కోచ్‌లు బౌండరీ లైన్ వద్ద నిలబడి ఆటగాళ్లకు నిరంతరం సలహాలు ఇస్తున్నారని పాంటింగ్ పేర్కొన్నాడు.తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రికీ పాంటింగ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. 'క్రికెట్ కూడా ఇప్పుడు ఫుట్‌బాల్ ఆటలా మారింది. కోచ్‌లు బౌండరీ లైన్ వద్ద నిల్చొని ఆటగాళ్లకు నిరంతరం సలహాలు ఇస్తున్నారు. ప్రస్తుత కాలంలో ఇలా డగౌట్ నుంచి సలహాలు తీసుకోని కెప్టెన్లు చాలా అరుదు. బహుషా.. ఐపీఎల్‌లో ఇలా డగౌట్ నుంచి సలహాలు తీసుకొని ఏకైక కెప్టెన్ ధోనీనే.ధోనీ తన నిర్ణయాలపై పూర్తి నమ్మకంతో ఉంటాడు. మ్యాచ్ సమయంలో డగౌట్ నుంచి వచ్చే సలహాలపై ఏ మాత్రం ఆధారపడడు. కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్ మైదానంలో సారథులకు సలహాలు ఇవ్వడం ఇప్పుడు సాధారణంగా మారిపోయింది. కానీ ధోనీ మాత్రం ఎవరీ సలహాలు తీసుకోడు. ఇదే అతన్ని ప్రత్యేకమైన సారథిగా నిలబెట్టింది. ఐపీఎల్‌లో అత్యంత నిలకడగా రాణించే జట్లలో చెన్నై సూపర్ కింగ్స్ ఒకటి. ఇందుకు ధోనీ నాయకత్వమే కారణం.'అని రికీ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025 సీజన్ తొలి మ్యాచ్‌లో తమ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు చాలా సలహాలు ఇచ్చామని కూడా రికీ పాంటింగ్ గుర్తు చేసుకున్నాడు. 'మా తొలి ఐపీఎల్ మ్యాచ్‌లో శ్రేయస్ అయ్యర్‌కు చాలా సలహాలు ఇచ్చాం. గేమ్‌లో చేయాల్సిన విషయాలపై అయ్యర్ తరుచూ ప్రశ్నలు అడిగాడు. టైమ్ ఔట్ సమయంలో కెప్టెన్లు, సీనియర్ ఆటగాళ్లతో మాట్లాడేందుకు కోచ్‌లకు అవకాశం ఉంటుంది.'అని పాంటింగ్ చెప్పుకొచ్చాడు.ఐపీఎల్ 2025 సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ గాయంతో సీజన్ మధ్యలోనే తప్పుకోవడంతో ధోనీనే మళ్లీ జట్టును నడిపించాడు. కానీ సీఎస్‌కే ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయింది. 14 మ్యాచ్‌ల్లో 4 మాత్రమే గెలిచి పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. ధోనీ 13 ఇన్నింగ్స్‌ల్లో 135.17 స్ట్రైక్ రేట్‌తో 196 పరుగులే చేశాడు.



## సైమా అవార్డ్స్ 2025 : స్పెషల్ అట్రాక్షన్ గా మీనాక్షి!

తాజాగా దుబాయ్ వేదికగా జరిగిన సైమా అవార్డ్స్ 2025:అవార్డ్స్ వేడుకలో ఎంతోమంది నటీనటులు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచారు. అయితే అందరిలోకెల్లా స్పెషల్ అట్రాక్షన్ గా.. సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా మీనాక్షి చౌదరి నిలిచింది. తాజాగా మీనాక్షికి సంబంధించిన ఫోటోలు,వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో చాలామంది జనాలు దేవకన్యలా ఉంది అంటూ మీనాక్షి చౌదరి లుక్ పై పోస్టులు పెడుతున్నారు.. 2025 సైమా అవార్డ్స్ ఈవెంట్ దుబాయ్ లో అట్టహాసంగా జరిగింది. 2024లో సౌత్ ఇండియాలో ప్రతిభ కనబరిచిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, సినిమాలకు సైమా అవార్డ్స్ అందించారు. ఇందులో పుష్ప -2,కల్కి వంటి సినిమాలకు అవార్డుల పంట పండింది. ఉత్తమ సినిమాగా కల్కి 2898%ూణ% కి అవార్డు రాగా.. ఉత్తమ హీరోగా పుష్ప-2 లో నటించిన అల్లు అర్జున్ కి, ఉత్తమ హీరోయిన్ గా రష్మిక మందన్నాకి..ఉత్తమ దర్శకుడి కేటగిరీలో సుకుమార్ కి.. ఉత్తమ సంగీత దర్శకుడిగా దేవిశ్రీప్రసాద్ కి ఇలా ఏకంగా నాలుగు అవార్డులు పుష్ప-2 మూవీ యూనిట్ వాళ్లు సొంతం చేసుకున్నారు.. అయితే లక్కీ భాస్కర్ మూవీలో నటించిన మీనాక్షి చౌదరికి ఉత్తమ (క్రిటిక్స్ విభాగంలో) నటి అవార్డు లభించింది. ఈ అవార్డు అందుకోవడం కోసం హీరోయిన్ మీనాక్షి చౌదరి రెడ్ కార్పెట్ పై నడుచుకుంటూ వెళ్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

## అట్టహాసంగా సైమా అవార్డుల వేడుక

సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్' సైమా వేడుక దుబాయ్‌లో అట్టహాసంగా జరుగుతోంది. డ్యాన్స్‌లతో తారలు సందడి చేశారు. 2024 సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరిచిన తెలుగు, కన్నడ నటీనటులు అవార్డులను సొంతం చేసుకున్నారు. మొదటి రోజు తెలుగు, కన్నడ చిత్రాలకు అవార్డులు అందజేశారు. 2024 సంవత్సరంలో విశేష ప్రతిభ కనబరిచిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు పురస్కార ప్రదానం చేశారు. పుష్ప-2, కల్కిఔశ) చిత్రాలకు నాలుగు విభాగాల్లో అవార్డులు వరించాయి. సైన్స్ ఫిక్షన్ జానర్‌తో తెరకెక్కి ప్రేక్షకుల్ని కొత్త లోకంలోకి తీసుకెళ్లిన 'కల్కి 2898 ఏడీ' ఉత్తమ చిత్రంగా నిలిచింది. ఉత్తమ నటు-డిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా రష్మిక అవార్డులు సొంతం చేసుకున్నారు. ఉత్తమ దర్శకుడిగా సుకుమార్,. ఉత్తమ సంగీత దర్శకుడిగా దేవి శ్రీప్రసాద్ నిలిచారు. ప్రైడ్ ఆఫ్ తెలుగు సినిమా



## హైప్‌ను క్రియేట్ చేస్తున్న స్పిరిట్

### బీజీఎం పనులు దాదాపు 70 శాతం పూర్తి




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రం 'స్పిరిట్'. ఈ మూవీ ఇంకా సెట్స్‌పైకి వెళ్లకముందే భారీ స్థాయిలో హైప్‌ను క్రియేట్ చేస్తోంది. తాజాగా ఈ ప్రాజెక్ట్‌పై సందీప్ రెడ్డి స్వయంగా ఒక షాకింగ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఓ టీవీ కార్యక్రమంలో పాల్గొన్న సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ మూవీ షూటింగ్ త్వరలో మొదలవుతుందన్నారు. ఇప్పటికే బీజీఎం పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయి. యానిమల్ -టైంలో మాదిరిగానే ముందుగా మ్యూజిక్ వర్క్ పూర్తిచేస్తే, సీన్ అవుట్‌పుట్ ఎలా వస్తుందో ముందే అర్థమవుతుంది. ఇది -టైమ్, ప్రొడక్షన్ బడ్జెట్ రెండింటినీ ఆదా చేస్తుంది అని అన్నారు. ఇక ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. ప్రభాస్ చాలా నిజాయితీగలవాడు, కోపం లేకుండా పని చేసే వ్యక్తి. స్టార్ అన్న అహంకారం ఆయనలో ఏమాత్రం లేదు. నేను ఊహించిన దానికన్నా ఎక్కువగా ఆయన ఈ సినిమాకు సహకరిస్తున్నారు. త్వరలోనే సెట్స్‌పైకి వస్తాం అని అన్నారు. 'బాహుబలి 2' ఇంటర్వెల్ సీన్ చూసిన తర్వాత తనకు 'అర్జున్ రెడ్డి' విషయంలో భయం వేసిందని దర్శకుడు సందీప్ వంగా అన్నారు. రామ్ గోపాల్ వర్మ గురించి సందీప్ మాట్లాడుతూ.. ఆయన ఎన్నో విషయాల్లో నాకు గురువు. ఆయన చిత్రాలు చూసి తెలియని విషయాలు నేర్చుకున్నా. 'సత్య' సినిమా 50, 60 సార్లు చూశాను. అది చూసే ఎడిటింగ్ నేర్చుకున్నా అని చెప్పారు. నేను ఇప్పటి వరకూ చూసిన సినిమాల్లో 'బాహుబలి 2' ఇంటర్వెల్ హైలైట్. దానికి మించిన ఇంటర్వెల్ సీన్ ఇప్పటి వరకూ లేదు. అది చూసి నా స్టూడియోకు వచ్చి 'అర్జున్ రెడ్డి' ఇంటర్వెల్ సీన్ చూశాను. ప్రేక్షకులకు నచ్చుతుందా లేదా అని ఒక్క నిమిషం భయం వేసింది. ఇంటర్వెల్ కూడా గొప్పగా ఉండాలని రాజమౌళి నిరూపించారు. 'అర్జున్‌రెడ్డి' -ట్రైలర్ విడుదలయ్యాక ప్రేక్షకుల స్పందన చూసి నాకు ధైర్యం వచ్చిందని చెప్పారు. ఇక 'స్పిరిట్' సినిమాలో ప్రభాస్ రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. ఇందులో ఒక పాత్ర పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ కాగా, రెండోది ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో మాఫియా డాన్. ఈ మాస్ మిక్స్ క్యారెక్టర్స్‌తో సినిమా హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి హిట్స్ ఇచ్చిన సందీప్ నుంచి ఇది మరో బిగ్ బ్లాక్ బస్టర్ అవుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ ఇతర సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. మారుతి దర్శకత్వంలో చేస్తున్న ది రాజా సాబ్ చిత్రం 2026 సంక్రాంతికి రిలీజ్ కానుంది. మరోవైపు ఫౌజీ (హను రాఘవపూడి డైరెక్షన్‌లో) చిత్ర షూటింగ్ శరవేగంగా సాగుతోంది. 'స్పిరిట్' కోసం సందీప్ రెడ్డి పెట్టిన కండిషన్ ప్రకారం, ప్రాజెక్ట్ ప్రారంభమైన తర్వాత ప్రభాస్ వేరే సినిమా చేయకూడదు. ప్రభాస్ దీనికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు- సమాచారం. అందుకే షూటింగ్ షెడ్యూల్స్ అందుకు అనుగుణంగా ప్లాన్ చేస్తున్నారు.




## మరో ప్రాజెక్ట్‌కు అల్లరి నరేశ్ శ్రీకారం

ఒకవైపు ఆల్కహాల్ సినిమాను విడుదలకు సిద్ధం చేస్తునే మరో కొత్త సినిమాను ప్రారంభించాడు అల్లరి నటుడు నరేష్. తన కెరీర్‌లో 65వ సినిమాగా రాబోతున్న ఈ ప్రాజెక్ట్ నేడు పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. ఈ చిత్రం పౌరాణిక హాస్యభరిత కథాంశంతో రూపొందుతున్నట్లు- చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరుకాగా.. యువ నటు-డు అక్కినేని నాగ చైతన్య క్లాప్ కొట్టాడు. దర్శకుడు బాబీ కెమెరా స్విచ్ ఆన్ చేయగా.. తొలి షాట్‌కి దర్శకుడు వి.ఐ. ఆనంద్ దర్శకత్వం వహించారు. దర్శకులు వశిష్ట, విజయ్ కుమార్, మరియు రామ్ అబ్బరాజు స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేశారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి చంద్రమోహన్ సి దర్శకుడు కాగా, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దంమరియు అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై లెమన్ ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడిగా చైతన్ భరద్వాజ్, ఎడిటర్‌గా ఛోటా కె. ప్రసాద్ వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరికొత్త పాత్రలో కనిపించనున్నట్లు- సమాచారం.

## సపోర్టింగ్ యాక్టర్ ఆశిష్ వారంగ్ ఆకస్మిక మృతి



బాలీవుడ్ ఇండస్ట్రీలో విషాదం చోటు-చేసుకుంది. ప్రముఖ నటుడు ఆశిష్ వారంగ్ మృతి చెందాడు. 55 ఏళ్ల ఆశిష్ మృతికి కారణాలు ఏంటనేవి ఇంకా తెలియరాలేదు. అతని ఆకస్మిక మరణవార్తా విన్న బాలీవుడ్ తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఆశిష్.. బాలీవుడ్ లో సపోర్టింగ్ క్యారెక్టర్స్ లో నటించాడు. అక్షయ్ కుమార్ నటించిన సూర్యవంశీ, దృశ్యం, మర్దానీ, ఏక్ విలన్ లాంటి సినిమాలు ఆశిష్ కు మంచి గుర్తింపును తీసుకొచ్చి పెట్టాయి.సినిమా వెబ్ సిరీస్ హిందీలోనే కాకుండా మరాఠీ చిత్రాల్లో కూడా ఆశిష్ నటించి మెప్పించాడు. ఇంకెంతో మంచి గుర్తింపు తెచ్చుకోవాల్సిన ఆశిష్ ఇలా అర్ధాంతరంగా మృతిచెందడం ఎంతో బాధకరమని పలువురు ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆశిష్ మృతికి కారణాలు ఏంటి అనేది ఇంకా తెలియరాకపోవడంతో బాలీవుడ్ మీడియా ఏవేవో అనుమానాలను వ్యక్తం చేస్తుంది. మరి ఆశిష్ వారంగ్ మరణానికి కారణం ఏంటి అనేది త్వరలోనే తెలుస్తుందేమో చూడాలి.

Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656